
ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY
నల్లగొండ
5
బుధవారం 11 జూన్ 2025




చికెన్ ధరలు	
లైవ్	124
డ్రెస్	184
స్కిన్‌లెస్	210
గుడ్డు డజన్	66
ఉష్ణోగ్రత	
గరిష్ఠం	39.0
కనిష్ఠం	23.0

సా..గుతున్న ప్రధాన రోడ్డు పనులు

● రాకపోకలకు ప్రజల ఇబ్బందులు



8



రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగులకు, దూపదీప నైవేద్య అర్చకులకు వరాల జల్లు కురిపించింది. సుదీర్ఘకాలంగా సేవలు అందిస్తున్న అర్చక, ఉద్యోగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు ఏర్పాటు చేసి పలు సంక్షేమ పథకాలను అమలు చేయనుంది. గత ప్రభుత్వం ట్రస్ట్‌ను ఏర్పాటు చేసినప్పటికీ నిధులు సమకూర్చలేదు. అయితే ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రకటించింది. దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అర్చక సంక్షేమ నిధి ద్వారా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న 250మంది అర్చకులు, 500 మంది దూపదీప నైవేద్య అర్చకుల సంక్షేమ నిధితో లబ్ధి చేకూరనుంది.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

అర్చక, ఉద్యోగులకు
వరాల జల్లు


- గ్రాట్యుటీ రూ.4 లక్షల నుంచి రూ.8 లక్షలకు పెంపు
- 500మంది డీడీఎన్ఎస్, 250మంది దేవాదాయ అర్చకులు,ఉద్యోగులకు ప్రయోజనం

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో సుదీర్ఘకాలంగా తమ సంక్షేమం కోసం ఎదురుచూస్తున్న అర్చక ఉద్యోగులకు ఊరట కలిగిందని చెప్పవచ్చు. అర్చకులు, ఉద్యోగులపై ఆధారపడిన ఎంతో మంది కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పథకాలు ఎంతగానో ప్రయోజనం చేకూర్చే విధంగా ఉన్నాయి.

అర్చక ఉద్యోగులు, డీడీఎన్ఎస్‌లకు ప్రయోజనం ఇలా..

ప్రభుత్వం గ్రాట్యూటీ రూ.4 లక్షల నుంచి రూ.8 లక్షలకు పెంచింది. అదేవిధంగా అర్చకులు, ఉద్యోగులకు మరణానంతరం, రిటైర్‌మెంట్ గ్రాట్యుటీ గ్రాంట్ రూపంలో 20 ఏళ్ల సేవలు అందించిన వారికి రూ.8లక్షల వరకు, 15 ఏళ్ల సేవలు అందించిన వారికి రూ.6లక్షలు, 10 ఏళ్ల సేవలు అందించిన వారికి రూ.4లక్షలు, 10 ఏళ్ల సర్వీస్ పూర్తికాకముందే మరణిస్తే రూ.2లక్షల గ్రాట్యూటీ రూపంలో చెల్లించనున్నారు. డీడీఎన్ అర్చకులకు మరణానంతరం గ్రాంట్ రూపంలో 20 ఏళ్ల సేవలు అందించిన వారికి రూ.4లక్షలు, 15ఏళ్లు అందించిన వారికి రూ.3లక్షలు, 10 ఏళ్ల సేవలు అందించిన వారికి రూ.2లక్షలు, 10 ఏళ్లు పూర్తికాక ముందే చనిపోతే రూ.లక్ష గ్రాంట్ చెల్లించనున్నారు. మెడికల్ బోర్డు సిఫార్సు చేసిన ప్రకారంగా రూ.2లక్షల వరకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ గ్రాంట్ ఇవ్వనున్నారు. డీడీఎన్ ఉద్యోగుల పిల్లల పెళ్లికి రూ.లక్ష116లు, రెగ్యూలర్ ఉద్యోగులకు..

- మిగతా 6వ పేజీలో...



పీసీసీ కార్యవర్గంలో
ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యం

- ముగ్గురికి ఉపాధ్యక్ష, నలుగురికి ప్రధాన కార్యదర్శి పదవులు
- యువనేతలకు అవకాశం
- ఎంపీ రఘువీర్‌కు పీసీసీ ఉపాధ్యక్షుడిగా ఛాన్స్
- ఆశించని పదవి ఇవ్వడంపై గుమ్ముల నారాజ్!

ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యవర్గంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా నాయకులకు ప్రాధాన్యం దక్కింది. పీసీసీ ఉపాధ్యక్ష పదవులు ముగ్గురికి, నలుగురికి ప్రధాన కార్యదర్శి పదవులు దక్కాయి. పీసీసీ ఉపాధ్యక్షులుగా నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, కొండేటి మల్లయ్య, గుమ్ముల మోహన్‌రెడ్డికి అవకాశం దక్కితే, ప్రధాన కార్యదర్శులుగా చనగాని దయాకర్‌గౌడ్, దైద రవీందర్, చకిలం రాజేశ్వర్‌రావు, వీ.రామారావుగౌడ్‌ని నియమించారు. పీసీసీ కార్యవర్గంలో ఉమ్మడి జిల్లా నుంచి ఎంపీతో పాటు, కీలక నేతలకు పదవులు దక్కడంపై కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

పీసీసీ కార్యవర్గంలో ఉమ్మడి జిల్లా నుంచి కీలకమైన నాయకులకే పీసీసీ కార్యవర్గంలో అవకాశం దక్కిందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ సాగుతోంది. జిల్లా నుంచి ప్రాతినిధ్యం దక్కిన వారిలో ముగ్గురు ఓసీ నేతలుండగా, ఇద్దరు ఎస్సీ నేతలు, ఇద్దరు బీసీ నేతలకు పదవులు వరించాయి. యువతరంతో పాటు ఆయా సందర్భాల్లో పార్టీకి పట్టుగొమ్మల్లా నిలిచిన నాయకులకు ఈ పదవులు దక్కాయనే అభిప్రాయం వెల్లడవుతోంది. రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయడంతో పాటు కేడర్‌ని బలోపేతం చేయడం ద్వారా వచ్చే ఎన్నికల నాటికి పార్టీకి సులభంగా విజయం దక్కేలా చూడాల్సిన కీలకబాధ్యతలు ఈ పీసీసీ కార్యవర్గంపై ఉందని పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఇప్పటికే పేర్కొనడం ఈ పదవులు పొందిన నేతలపై ఉన్న బాధ్యతలని తెలుపుతోంది. దక్షిణ భారతదేశంలోనే అత్యధికమెజార్టీతో గెలిచిన నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌కి పీసీసీ ఉపాధ్యక్షుడిగా అవకాశం దక్కింది. గత పీసీసీ కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన రఘువీర్, అంతకుముందు రాష్ట్ర యువజన కాంగ్రెస్‌లో జాయింట్ సెక్రటరీగా పనిచేశారు. మరో ఉపాధ్యక్షుడిగా నియమితులైన గుమ్ముల మోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి వీరవిధేయుడుగా పేరుగాంచారు. విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్ కార్యకర్తగా పనిచేస్తున్న ఆయన ఒక పర్యాయం జడ్పీటీసీ సభ్యుడిగా పనిచేయగా, ఉమ్మడి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం పనిచేశారు. నల్లగొండ పట్టణాధ్యక్షుడిగా ప్రస్తుతం కొనసాగుతున్నారు. ఉపాధ్యక్షపదవి వరించిన మరో నేత కొండేటి మల్లయ్య గత పీసీసీ కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా ఉండగా, అంతకుమునుపు ఆయన నిడమనూరు జడ్పీటీసీ సభ్యుడిగా పనిచేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నకిరేకల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే టిక్కెట్ ఆశించగా, అప్పటి సమీకరణాల్లో అవకాశం దక్కలేదు. తాజాగా ఈయనకు ఈ పదవి వరించింది.

ప్రధాన కార్యదర్శులుగా నలుగురికి ఛాన్స్

పీసీసీ తాజా కార్యవర్గంలో ఉమ్మడి జిల్లా నుంచి నలుగురు కీలకనాయకులు ప్రధాన కార్యదర్శులుగా నియమితలయ్యారు. సూర్యాపేట నియోజకవర్గం తాళ్లఖమ్మంపహాడ్‌కు చెందిన సీనియర్‌నేత చకిలం రాజేశ్వరరావుకు ఈ కమిటీలో ప్రధాన కార్యదర్శిగా అవకాశం దక్కింది. ఈయన గత కార్యవర్గంలో పీసీసీ అధికార ప్రతినిధిగా పనిచేయగా, అంతకుమునుపు ఉమ్మడి జిల్లా డీసీసీ అధికార ప్రతినిధిగా సుదీర్ఘకాలం పనిచేశారు. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌లలో పనిచేస్తూ వచ్చిన రాజేశ్వరరావు పార్టీలో తుంగతుర్తి నియోజకవర్గ కోఆర్డినేటర్‌గానూ పనిచేశారు. అదేవిధంగా పార్టీ అనుబంధ సంఘాల్లో, పార్టీ కార్యక్రమాల్లో విస్తృతస్థాయిలో పనిచేసిన అనుభవం రాజేశ్వరరావుకు ఈ పదవి దక్కడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ప్రధాన కార్యదర్శిగా మరో కీలకనేత దైద రవీందర్‌కు అవకాశం దక్కింది. సూర్యాపేట మాజీ ఎమ్మెల్యే దైద సుందరయ్య తనయుడైన దైద రవీందర్ 2016లో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం పీసీసీ కార్యదర్శిగా నియమితులైన ఆయన నకిరేకల్ ఇన్‌చార్జిగా పనిచేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నకిరేకల్ ఎమ్మెల్యే టిక్కెట్ ఆశించి, చివరివరకు పోటీపడ్డారు. ప్రస్తుతం ఈయనకు పీసీసీ ప్రధాన కార్యదర్శిగా అవకాశం ఇవ్వడం ద్వారా మరోసారి ఆయన క్రియాశీలకమయ్యేందుకు అవకాశం ఏర్పడింది. పీసీసీ ప్రధాన కార్యదర్శిగా జిల్లా నుంచి మరో బీసీ యువనేత చనగాని దయాకర్‌గౌడ్‌ని నియమించారు. నకిరేకల్ మండలం తాటికల్‌కు చెందిన ఈయన విద్యార్థి జేఏసీ నేతగా తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పనిచేసిన సమయంలో పార్టీలో చేరిన దయాకర్‌గౌడ్ పార్టీ నిరుద్యోగ జేఏసీ నాయకుడిగా, పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పలు ఆందోళనలు, ఉద్యమాల్లో క్రియాశీలకపాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో ఆయనకు తాజాగా పీసీసీ ప్రధానకార్యదర్శి పదవి దక్కింది. మరో...

- మిగతా 6వ పేజీలో...

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



బుడుమర్లపల్లి సదస్సులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

కనగల్ జూన్ 10 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ జే శ్రీనివాస్ కోరారు. మండంలోని బుడుమర్లపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన సదస్సును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. రైతుల నుంచి అందిన దరఖాస్తులను సక్రమంగా నమోదు చేయాలన్నారు. కాగా భూసమస్యల పరిష్కారం కోరుతూ 50 దరఖాస్తులను రైతులు అందజేశారని తహసీల్దార్ పద్మ తెలిపారు. అదేవిధంగా తుర్కపల్లి గ్రామంలో జరిగిన సదస్సులో 11 దరఖాస్తులు వచ్చినట్లు డీటీ పార్వతమ్మ తెలిపారు. ఆయా సదస్సుల్లో సీనియర్ అసిస్టెంట్ విఘ్నేష్‌రెడ్డి, లతీఫ్ తదితరులున్నారు.

మహిళా సంఘాల బలోపేతమే లక్ష్యం



విదార్థులకు పాఠశాల యునిఫాంను అందజేస్తున్న డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి

నల్లగొండ రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాల ద్వారా ఉపాధి కల్పిస్తోందని డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. మహిళా సంఘాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తయారు చేసిన యూనిఫాంలను మంగళవారం మండలంలోని చందనపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలకు ఉపాధి కల్పించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టిందన్నారు. అందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే యూనిఫాంల తయారీని మహిళా సంఘాలకు అప్పగించిందన్నారు. యూనిఫాంలకు కావాల్సిన సామాగ్రిని అందించి తద్వారా దుస్తులను తయారు చేయిస్తుందన్నారు. అందులో భాగంగా నల్లగొండ మండలంలోని 35 మహిళా సంఘాల ద్వారా మండలంలోని 45 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యునిఫాంను కుట్టించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు యూనిఫాం అందించే కార్యక్రమాన్ని చందనపల్లి నుంచి ప్రారంభించామన్నారు. ఈ పాఠశాలలో 134 మంది విద్యార్థులకు యునిఫాం అందించామని తెలిపారు. మిగిలిన పాఠశాలల్లో బుధవారం నుంచి పంపిణీ ఉంటుందన్నారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు మహిళా సంఘాల వారు తమవంతుగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో మెరుగైన విద్య అందించడంతో పాటు, విద్యార్థులకు అన్నిరకాల వసతులను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, వారి తల్లితండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నల్లగొండ మండల విద్యాశాఖాధికారి అరుంధతి, ఏపీఎం వినోద, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: సామేల్

8

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న పౌష్టికాహార పంపిణీ, పాఠశాల పూర్వ విద్య కార్యక్రమాల ద్వారా లబ్ధి పొందేందుకు 5 సంవత్సరాలలోపు పిల్లలందరినీ దగ్గరలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. ఈ నెల 10 నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్న 'అమ్మ మాట అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని గొల్లగూడలోని 3వ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో చిన్న పిల్లలతో నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. గర్భిణులు, బాలింతలు, ఆరు నెలల నుంచి ఐదు సంవత్సరాలలోపు ఉన్న పిల్లలను సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు.

విద్యార్థుల నమోదుపై దృష్టి కేంద్రీకరించాలి

పాఠశాల విద్యను పటిష్టపరచడంలో భాగంగా విద్యార్థుల నమోదుపై దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఉదయాదిత్య భవన్‌లో విద్యాశాఖ అధికారులతో పాటు, మండలాల ప్రత్యేక అధికారులతో విద్యాశాఖ కార్యక్రమాలపై మంగళవారం సమీక్షించారు. మధ్యలో బడి మానేసే వారి శాతాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో మండలాల ప్రత్యేక అధికారులు సైతం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ప్రతి పాఠశాల వారీగా గత సంవత్సరం విద్యార్థుల నమోదు, ఈ సంవత్సరం విద్యార్థుల నమోదుపై నివేదిక సమర్పించాలని, అలాగే ప్రతి కేజీబీవీ వారీగా విద్యార్థుల నమోదు వివరాలు ఇవ్వాలన్నారు. పాఠశాలల పునఃప్రారంభం విద్యార్థుల నమోదు, టీచర్లు, తల్లిదండ్రుల సమావేశాలు, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల యూనిఫాం, భవిత కేంద్రాల సంసిద్ధత, మధ్యలో బడి మానేసేవారు, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. భవిత కేంద్రాల్లో అన్ని సౌకర్యాలను మరోసారి పరిశీలించాలని, మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. 12న పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా 12,13వ తేదీన టీచర్లు, తల్లిదండ్రుల మెగా సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో రెండు రోజుల పాటు పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్యను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి కలెక్టర్ నారాయణ అమిత్, డీఈవో బిక్షపతి, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడి బాట కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి

భూ భారతి నిబంధనల ప్రకారమే భూ సమస్యలు పరిష్కారం

మర్రిగూడ: రెవెన్యూ సదస్సులను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం మండలంలోని కుదాభక్షిపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో రైతులను భూ సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో గతంలో ఇచ్చిన సీలింగ్ భూములకు నూతన పాస్ పుస్తకాలు ఇవ్వాలని కోరారు. సాగుకు యోగ్యంకాని భూమి ఉంటే వాటిని రైతులే స్వచ్ఛందంగా నాలా చేసుకోవాలని, లేని పక్షంలో వారికి భారీగా ఫైన్ వేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాస్‌నాయక్, మద్ది విట్టల్ రెడ్డి, పాశం సురేందర్‌రెడ్డి, బూడిద సురేష్ పాల్గొన్నారు. మర్రిగూడ మండలకేంద్రంలోని 30 పడకల కమ్యూనిటీ హెల్త్ ఆస్పత్రిని కలెక్టర్ చేశారు.

నిర్వాసితులందరికీ పరిహారం, పునరావాసం

- భూనిర్వాసితులకు పరిహారం పంపిణీ చేసిన ఎమ్మెల్యే బాలునాయక్

7

శాలిగౌరారం ప్రాజెక్టు కాల్వలకు నీటి విడుదల

- పొదుపుగా వాడుకోవాలి : ఎమ్మెల్యే సామేల్

7



నకిలీ పత్తి విత్తన దందా

- భారీ మొత్తంలో నకిలీ విత్తనాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తయారీ జిల్లాలో విక్రయాలు
- ధర తక్కువగా ఉండటంతో ఆకర్షితులవుతున్న రైతులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ పత్తి విత్తన ప్యాకెట్లు

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట క్రైం)

సూర్యాపేట జిల్లాలో నకిలీ పత్తి విత్తనాల దందా కొనసాగుతోంది. ప్రభుత్వం నిషేధించిన పలు రకాల పత్తి విత్తనాలను గుట్టు చప్పుడు కాకుండా గ్రామాల్లో అమ్ముతున్నారు. కొందరు ఏజెంట్లు నకిలీ విత్తనాలను అందమైన ప్యాకింగ్‌లు చేసి గ్రామాల్లో తిరుగుతూ వీటితోనే ఎక్కువ దిగుబడి వస్తుందని నమ్మించి విక్రయిస్తున్నారు. చూడటానికి బాగానే ఉండటం, తక్కువ ధర ఉండటంతో పలువురు రైతులు వీటిని కొనుగోలు చేస్తున్నారు. ఎక్కువగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల నుంచి ఈ విత్తనాలు సరఫరా అవుతున్నాయి.

- వివరాలు 6లో



పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డీపీఎంవో వెంకటేశ్వరచారి

కుష్టువ్యాధి నిర్మూలనకు కృషి

చిట్యాలరూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కుష్టువ్యాధి వచ్చిన వారికి మల్టీ డ్రగ్ థెరపీతో పూర్తిగా నిర్మూలించవచ్చని జిల్లా పారామెడికల్ అధికారి భగవాన్‌నాయక్ అన్నారు. మండలంలోని వెలిమినేడు పీహెచ్‌సీని మంగళవారం కుష్టువ్యాధి నిర్మూలన బృందం అధికారులు డిప్యూటీ పారామెడికల్ అధికారులు వెంకటేశ్వరచారి, శ్రీనివాస్‌రెడ్డి, అరుణ, నల్లగొండ అధికారి హనీఫ్ పరిశీలించారు. ఆసుపత్రిని, రికార్డులను, రోగుల రిపోర్టులను, ల్యాబ్‌ను, మందుల పంపిణీ, నిల్వగదిని, రోగులకు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశాకార్తలతో అధికారులు సమావేశమై కుష్టువ్యాధి నిర్మూలన గురించి అవగాహన కల్పించారు. కుష్టువ్యాధి వచ్చిన మొదట్లోనే గుర్తించి నిర్మూలనకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కుష్టువ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి మల్టీ డ్రగ్ థెరపి ద్వారా పూర్తిగా నిర్మూలించ వచ్చన్నారు. లక్షణాలు కన్పిస్తే ఆరోగ్య పరీక్షలను చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఉబ్బు నర్సింహ, శ్యాం, సీహెచ్‌వో శ్రీనివాసచక్రవర్తి, లక్ష్మీ, వైద్య తదితరులు పాల్గొన్నారు.

రేపు పోచంపల్లికి గవర్నర్ రాక!

ఏర్పాట్లను పరిశీలించిన యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్

భూదాన్‌పోచంపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లిని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఈ నెల 12వ తేదీన సందర్శించనున్నట్లు తెలిసింది. మంగళవారం జిల్లా కలెక్టర్ హనుమంతరావు భూదాన్‌పోచంపల్లిలో పలువురు మగ్గం కార్మికులతో మాట్లాడారు. గవర్నర్ పర్యటనలో భాగంగా చేనేత మగ్గాల పనితీరు, కార్మికుల జీవన స్థితిగతులపై అభిప్రాయాల సేకరణ, చేనేత నైపుణ్యం, ఇక్కత్ విశిష్టత తదితర అంశాలపై కార్మికులతో మాట్లాడే ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయన వెంట చేనేత జౌళిశాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు ఇందుమతి, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మ, జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ శ్రీనివాస్‌రావు, చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అంజన్‌రెడ్డి, తహసీల్దార్ పి. శ్రీనివాస్ రెడ్డి, నాయబ్ తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఎంఆర్ఐ వెంకట్‌రెడ్డి, పోచంపల్లి చేనేత టైఅండ్‌డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, అర్బన్ బ్యాంకు చైర్మన్ తడక రమేష్, చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, నాయకులు భారత భూషణ్, బిట్ల గణేష్, బొమ్మ హరిశంకర్, వేశాల మురళి తదితరులు పాల్గొన్నారు.



చేనేత మగ్గం కార్మికుడి ఇంటిని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

నేడు చండూరు మునిసిపల్ కమిషనర్‌తో ఫోన్‌ఇన్



చండూరు మునిసిపల్ కమిషనర్ పుష్పలత

చండూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : చండూరు మునిసిపల్ కమిషనర్ పుష్పలతతో బుధవారం 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహించనుంది. ఈ కార్యక్రమం ద్వారా పట్టణ ప్రజలు తమ సమస్యలను నేరుగా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లవచ్చు. ప్రజా సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాలనుకునే వారు. వారు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు 9949920611 నెంబర్‌కు ఫోన్ చేసి కమిషనర్‌తో నేరుగా మాట్లాడవచ్చు. తమ సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమార్గాన్ని కోరవచ్చు.

నకిలీ పత్తి విత్తనాల దందా

- గ్రామాల్లో జోరుగా విక్రయాలు
- పలువురిని పట్టుకున్న పోలీసులు
- ఈ ఏడాది ఇప్పటికే రూ.కోటికి పైగా విలువ చేసే నకిలీ విత్తనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నకిలీ పత్తి విత్తన ప్యాకెట్లను పరిశీలిస్తున్న సూర్యాపేట జిల్లా ఎస్పీ నర్సింహ

సూర్యాపేటక్రైం, జూన్ 10, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నకిలీ పత్తి విత్తనాల దందా కొనసాగుతోంది. ప్రభుత్వం నిషేధించిన పలు రకాల పత్తి విత్తనాలను గుట్టు చప్పుడు కాకుండా గ్రామాల్లో అమ్ముతున్నారు. కొంతమంది ఏజెంట్లు నకిలీ విత్తనాలను అందమైన ప్యాకింగ్‌లు చేసి గ్రామాల్లో తిరుగుతూ వీటితోనే ఎక్కువ దిగుబడి వస్తుందని నమ్మించి విక్రయిస్తున్నారు. చూడటానికి బాగానే ఉండటం, తక్కువ ధర ఉండటంతో పలువురు రైతులు వీటిని కొనుగోలు చేస్తున్నారు. ఎక్కువగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల నుంచి ఈ విత్తనాలు సరఫరా అవుతున్నాయి. ద్విచక్ర వాహనాలపై వచ్చి దుకాణాదారులకు కూడా విక్రయిస్తున్నట్లు ఇటీవల పోలీసుల దర్యాప్తులో కూడా తేలింది. జిల్లాలో అరుణోదయ, అడ్వాన్స్ 333 అనే కంపెనీల పేర్లతో పాటు మరికొన్ని కంపెనీలకు చెందిన విత్తనాలను విక్రయిస్తున్నట్లు సమాచారం. కాగా ఈ ఏడాది ఇప్పటి వర కు సూర్యాపేట జిల్లా పోలీసులు నకిలీ పత్తి విత్తనాలు విక్రయించే, తయారు చేసే వారిని పట్టుకున్నారు. వారి నుంచి సుమారు కోటికి పైగా విలువ చేసే నకిలీ విత్తన ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

మోసపోతున్న రైతులు

లైసెన్స్ కలిగిన పత్తివిత్తనాల కంటే లైసెన్స్‌లేని పత్తివిత్తనాలు ఎక్కువ దిగుబడి వస్తుందని నమ్మించి రైతులను మోసం చేస్తున్నారు. ఎకరం పత్తి విత్తనాలు వేస్తే సాధారణంగా 6 నుంచి 7క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. అసలు పెట్టుబడి కూడా వెళ్లని పరిస్థితి ఉం టుందని కొంత మంది రైతులు అభిప్రాయపడుతున్నారు.

బీజీ-3 విత్తనాలతోదెబ్బతింటున్న భూసారం

పర్యావరణం, నేలకు ప్రతికూలమైన నిషేదిత పత్తి విత్తనాలను సూర్యాపేట, నల్లగొండ జిల్లా లో అమ్ముతున్నారు. ఎక్కువగా రాయలసీమ నుంచి బీజీ-3 పత్తి విత్తనాలు రహస్యంగా వాహనాల్లో తెచ్చి అమ్ముతున్నారు. వ్యవసాయ శాఖ విత్తనాల సరఫరాను అరికట్టలేకపోతోందని విమర్శలు ఉన్నాయి. ఈ విత్తనాలు సాధారన పత్తి విత్తనాల కన్న తక్కువ ధర ఉంటుంది. మార్కెట్‌లో పత్తి విత్తనాల ధర రూ.1500కు పైగా ఉంటే బీజీ -3 పత్తి విత్తనాలు కూడా అదే ధరలో ఉన్నప్పటికీ ఇవి గడ్డి మందును తట్టుకునే జన్యువుతో రూపొందించారు. వీటిని ప్రభుత్వం నిషేధించింది. హెర్బిసైడ్‌టాలరెంట్ (హెచ్‌టీ) పత్తి విత్తనాల సాగు ప్రమాదమని సర్వేలు స్పష్టం చేశాయి. అయినప్పటికీ రహస్యంగా వినియోగిస్తున్నారు. ఈ పత్తి విత్తనాలు వేస్తే గడ్డి మొలవదు. అయితే ప్రమాదకరమైన గ్లైఫోసైట్‌సెట్ మందు నేలను గుల్ల బారుస్తుంది. దీని వల్ల పోషకాలు దెబ్బతినడంతో పాటు కాల క్రమేణా భూసారం నిస్సారంగా మారుతుంది. కొన్ని పెద్ద కంపెనీలు మొదలుకొని చిన్న చిన్న కంపెనీలు కూడా హెచ్‌టీ విత్తనాలను తయా రు చేస్తున్నాయి. కర్నూలు, మహబూబ్‌నగర్, ఆదోని ప్రాంతాల నుంచి ఎక్కువగా వీటిని తయారు చేస్తున్నారు. మన దగ్గర గ్లైఫోసెట్ గడ్డి మందును కేవలం తేయాకు తోటల్లో వాడేందుకు అనుమతి ఉంది. ఇప్పుడు పత్తి సాగులోనూ వినియోగించుకునేందుకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రిసెర్చ్ నుంచి అనుమతులు వస్తాయని భావించిన కొన్ని కం పెనీలు హెచ్‌టీ విత్తనాలను తయారు చేసినట్లు తెలుస్తోంది. కొన్ని కంపెనీలకు చెందిన దళారులు గ్రామాల్లో పర్యటిస్తూ (బీజీ-3), బీజీ-2 విత్తనాల పేరుతో రైతులను బురిడీ కొట్టిస్తున్నారు. కలుపు బాధ తప్పుతుందని భావిస్తున్న కొందరు రైతులు దీని ప్రభావం తెలియక విత్తనాల వైపు మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో ఎక్కువగా ఆత్మకూర్(ఎస్), తుంగతుర్తి, మోతె, అర్వపల్లి, చింతలపాలెం, మేళ్లచెర్వు, పాలకీడు, మఠంపల్లి, పెన్‌పహాడ్, నూతనకల్, మద్దిరాల మండలాల్లో పత్తి పంటను సాగు చేస్తున్నారు.

సరిహద్దు జిల్లాల నుంచి సరఫరా

సూర్యాపేట జిల్లాకు నకిలీ పత్తి విత్తన ప్యాకెట్లు సరిహద్దు జిల్లాల నుంచి సరఫరా అవుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఖమ్మం, మహబూబాబాద్, ఏపీ రాష్ట్రంలోని గుంటూరు, ఎన్టీఆర్ కృష్ణా జిల్లాల నుంచి నకిలీ పత్తి విత్తనాలు వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక రాష్ట్రంలో తయారు చేసిన నకిలీ విత్తనాలను సరిహద్దు జిల్లాల్లో రహస్య ప్రదేశాల్లో గల గోదాంలో నిల్వ చేసి బైక్‌లపై గ్రామాల్లో తిరుగుతూ రైతులకు విక్రయిస్తున్నారు. నకిలీ విత్తనాలు అరికట్టాల్సిన టాస్క్‌ఫోర్స్ బృందాలు జిల్లాలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో మాత్రమే తనిఖీలు చేసి చేతులు దులుపుకున్నారు.

బీజీ-3 పత్తి విత్తనాలు వినియోగించొద్దు

బీజీ-3 పత్తి విత్తనాలు పర్యావరణానికి పంటలకు హాని చేస్తాయి. కేవలం కలుపును తట్టుకునే శక్తి ఉందని రైతులు భావిస్తున్నారు. దిగుబడి కూడా పెద్దగా రాకపోగా భూమిలో ఉన్న పోషకాలు మొత్తం హరించుకుంటాయి. రైతులు వీటిని వినియోగించవద్దు. లైసెన్స్ కలిగిన దుకాణాల్లోనే పత్తివిత్తనాలు కొనుగోలు చేయాలి. నకిలీ విత్తనాల విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. ఇప్పటికే కొంతమందిని అరెస్ట్ చేశాం. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు విత్తనాలు విక్రయిస్తే కొనవద్దు. అలాంటి వారి సమాచారాన్ని వెంటనే పోలీసులకు తెలపాలి. నకిలీ విత్తనాలు విక్రయించినా, తయారు చేసినా పీడీయాక్టు కేసు నమోదు చేస్తాం.

- కొత్తపల్లి నర్సింహ, ఎస్పీ సూర్యాపేట.

అధిక దిగుబడులు వస్తాయని నమ్మించి

- రైతులకు నకిలీ పత్తి విత్తనాలు అంటగడుతున్న ముఠా
- రూ.65లక్షల విలువ చేసే 22 క్వింటాళ్ల నకిలీ విత్తనాలు సీజ్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ నర్సింహ



విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నర్సింహ, పక్కన అదనపు ఎస్పీ

సూర్యాపేటక్రైం,జూన్10,(ఆంధ్రజ్యోతి): రైతులకు విక్రయించేందుకు సిద్ధం చేసిన నకిలీ పత్తి విత్తనాలను సూర్యాపేట జిల్లా పోలీసులు పట్టుకున్నారు. రెండు వేర్వేరు కేసులకు సంబంధించి ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు రూ.65లక్షల విలువగల 22 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం చే సుకున్నారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కొత్తపల్లి నర్సింహ వివరా లు వెల్లడించారు. ఈ నెల 9న ఆత్మకూర్(ఎస్) మండలం పాతర్లపాడు స్టేజీ వద్ద సూర్యాపేట సీసీఎస్, ఆత్మకూర్(ఎస్) మండల పోలీసులు సంయుక్తంగా వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రానికి చెందిన తండ నగేష్ బైక్‌పై గోనె సంచి పెట్టుకుని సూర్యాపేట వైపు వెళ్తున్నాడు. పోలీసులు బైక్ ఆపి సంచి తనిఖీ చేశారు.అందులో ఎలాంటి ఆధారాలు లేని 120 ప్యాకెట్ల పత్తి విత్తనాలు ఉన్నాయి. అనుమానంతో నగేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా వాటిని ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెంమండలం పెనుగోలు గ్రామానికిచెందిన పంది రాములు వద్ద తీసుకొచ్చినట్లు ఒప్పుకున్నాడు.

అరుణోదయ పేరుతో విక్రయాలు

నిందితులందరినీ సూర్యాపేటకు తరలించి పోలీసులు విచారించగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా ఇంకోలు గ్రామానికి చెందిన మాగులూరి సాంబశివరావు అరుణోదయ అనే విత్తన కంపెనీని ఏర్పాటు చేసి గడ్డి మందుకు తట్టుకుని, అధిక దిగుబడులు ఇచ్చే విత్తనాలు అని నమ్మబలుకుతూ అతడి కంపెనీ నుంచి కర్నూలుకు జిల్లా పల్లిపాడుకు చెందిన చెవుల నర్సింహులు వాహనంలో విత్తన ప్యాకెట్లను గుంటూరు శ్రీనివాసరావుకు సరఫరా చేస్తున్నాడు. వాటిని శ్రీనివాసరావు ఒక్కొక్కరికి విక్రయిస్తున్నాడు. రైతులకు విక్రయిస్తున్న సమయంలో పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. నిందితుల సమాచారం మేరకు నకిలీ విత్తనాలు తయారు చేసి విక్రయిస్తున్న అరుణోదయ కంపెనీ ఎండీ సాంబశివరావుతో అదుపులోకి తీసుకున్న అందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. సాంబశివరావుతో పాటు విత్తన ప్యాకెట్లను సరఫరా చేసే నర్సింహులు పరారీలో ఉన్నారని ఎస్పీ తెలిపారు.

మరో కేసులో..

మోతె పోలీసులు, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా ఈ నెల 9న మోతె మండల పరిధిలోని రావిపహాడ్ గ్రామంలోని వెలుగు శ్రీను ఇంట్లో నకిలీ పత్తి విత్తనాలు ఉన్నాయని దాడి చేశారు. ఇంట్లో అడ్వాన్స్ 333, అరుణోదయ కంపెనీకి చెందిన 98 నకిలీ పత్తి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నా రు. శ్రీనును అదుపులోకి తీసుకుని విచారించారు. శ్రీనుకు బంధువైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లాకు చెందిన చర్లపల్లి శాతవాహన అనే వ్యక్తితో కలిసి మోతె మండల పరిధిలోని గ్రామాల్లో నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్నట్లు అంగీకరించాడు. పోలీసులు ఎన్టీఆర్ జిల్లాకు వెళ్లి శాతవాహనను అదుపులోకి తీసుకొని 30 ప్యాకెట్ల విత్తనాలు లభించాయి. అతనిని విచారించగా కర్ణాటక రాష్ట్రం నలుగునూర్‌కు చెందిన తిరుమల్ నకిలీ విత్తనాలు సరఫరా చేస్తున్నాడని చెప్పాడు. నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న శ్రీను, శాతవాహన, తిరుమల్‌పై కేసు నమోదు చేసి వారి నుంచి రూ.రెండు లక్షల విలువ చేసే 58 కిలోల నకిలీ విత్తనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తిరుమల్ పరారీలో ఉన్నాడని త్వరలో పట్టుకుంటామని ఎస్పీ తెలిపారు. నకిలీ విత్తనాలు పట్టుకున్న పోలీసులను ఎస్పీ అభినందించి రివార్డులు అందచేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ యు. రవీందర్‌రెడ్డి, సూర్యాపేట డీఎస్పీ వి. ప్రసన్నకుమార్, సీసీఎస్, సూర్యాపేట రూరల్, మునగాల సీఐలు శివకుమార్, గురుకుల రాజశేఖర్, రామక్రిష్ణారెడ్డి, సీసీఎస్, ఆత్మకూర్(ఎస్), మోతె ఎస్ఐలు హరిక్రిష్ణ, శ్రీకాంత్‌గౌడ్, యాదవేంద్రరెడ్డి తదితరులు ఉన్నారు.

డొంక కదిలిందిలా..

ఈ విత్తనాలు గడ్డి మందును తట్టుకునేవని, అధిక దిగుబడులు వస్తాయని రైతులను నమ్మించి విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు నగేష్ అంగీకరించాడు. అతను ఇచ్చిన సమాచారంతో పెనుగోలు గ్రామంలో రా ములును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 120 ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. అతడిని విచారించగా ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్‌కృష్ణా జిల్లా మైలవరానికి చెందిన బానోతు జయరాం నకిలీ విత్తనాలు సరఫరా చేస్తున్నాడని చెప్పడంతో అతనిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా జయరాంకు సరఫరా చేసే గుంటూరుకు చెందిన తరిగొప్పల శ్రీనివాసరావు మైలవరం రావడంతో అతడిని కూడా అదుపులోకి తీసుకొని, వారిని గుంటూరులోని శ్రీనివాసరావు దుకాణం వద్దకు తీసుకెళ్లారు. అక్కడ నిల్వ ఉన్న 37 బస్తాల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. ఒక్కో బస్తాలో 120 ప్యాకెట్ల చొప్పున ఉన్నాయి.

నల్లగొండలో బాలుడి కిడ్నాప్ కలకలం



కిడ్నాప్‌కు గురైన బాలుడు(ఫైల్)

నల్లగొండ, భువనగిరి టౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాకేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో ఏడాదిన్నర బాలుడి కిడ్నాప్ మంగళవారం కలకలం రేపింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం తుంగపాడుకు చెందిన భాగ్యలక్ష్మి అనే గర్భిణి వైద్యం నిమిత్తం సోమవారం తన భర్త అంజిబాబు, కుమారుడు సోమేష్ కుమార్‌తో పాటు బంధువు పార్వతమ్మతో కలసి జిల్లాకేంద్ర ఆసుపత్రికి వచ్చింది. వైద్యుల పరీక్షల అనంతరం ఆమెను ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. మంగళవారం మధ్యాహ్నం భాగ్యలక్ష్మి బంధువు పార్వతమ్మ బాలుడు సోమేష్‌ను ఎత్తు కొని ఆస్పత్రి ఆవరణలో భోజనానికి వెళ్లింది. అక్కడ క్యూలైన్ ఎక్కువగా ఉండ డంతో పక్కనే ఉన్న ఓ మహిళ ఆమెతో మాటామాటా కలపడంతో ఇద్దరూ ముచ్చటించుకోవడంతో స్నేహం ఏర్పడింది. దీంతో పార్వతమ్మ ఆ బాలుడిని సదరు మహిళకు బాలుడిని అప్పగించి భోజనం కోసం లైన్‌కు వెళ్లింది. తిరిగి వచ్చేసరికి బాలుడిని అప్పగించిన మహిళ అక్కడ తన మనవడు కనిపించ కపోవడంతో లబోదిబోమంది. ఆస్పత్రి ఆవరణలో ఎంత వెతికినా బాలుడి ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్రమత్తమైన టూటౌన్ పోలీ సులు సీసీ కెమెరాల పుటేజీలు పరిశీలించారు. పట్టణంలోని అన్ని లాడ్జీలు, హోటళ్లను తనిఖీ చేశారు.

కిడ్నాపర్లు భువనగిరిలో ఉన్నట్లు ఆనవాళ్లు

కిడ్నాప్‌కు గురైన బాలుడు భువనగిరి సమీపంలో ఉన్నట్లు సమాచారంతో పోలీసులు అక్కడ బయలుదేరి వెళ్లినట్లు తెలిసింది. బాలుడిని కిడ్నాప్ చేసిన ఇద్దరు మహిళలు సుమారు సాయంత్రం నాలుగు గంటలకు భువనగిరి బస్టాండ్ నుంచి వెలుపలికి వస్తున్నట్లు సీసీ కెమెరాలలో రికార్డు అయింది. నల్లగొండలో కిడ్నాప్ అయిన వెంటనే పోలీసులు అన్ని పోలీస్ స్టేషన్లు, బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు తదితర ప్రయాణ మార్గాల్లో అప్రమత్తమయ్యారు. ఇద్దరు మహిళా కిడ్నాపర్స్ చిన్నారితో బస్టాండ్ వెలుపలికి వచ్చిన సమీపంలోని ఓ వస్త్ర దుకాణంలో దుస్తులు కొనుగోలు చేసి పేటీఎం ద్వారా డబ్బులు చెల్లించినట్లు సీసీ కెమెరాల్లో నమోదైంది. సీసీ పుటేజీని సోషల్ మీడియాలో పోస్ట్ చేసి కిడ్నాపర్స్ ఆచూకీ లభిస్తే సమాచారం ఇవ్వాలని భువనగిరి పట్టణ ఇన్‌స్పెక్టర్ రమేష్ కుమార్, ఎస్ఐలు కుమార స్వామి, లక్ష్మీనారాయణ తెలిపారు. పేటీఎం పేమెంట్ ఆధారంగా కిడ్నాపర్స్‌ను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు పేర్కొంటున్నారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు.. జరిమానా

సూర్యాపేటక్రైం, జూన్ 10, (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జల్లాకేంద్రంలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 9వ తేదీన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. పట్టుబడిన ఐదుగురిని మంగళవారం సూర్యాపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ కోర్టులో హాజరు పర్చగా సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ బీవీ రమణ ఒకరికి మూడు రోజుల జైలుశిక్ష, మరొకరికి రెండు రోజుల జైలుశిక్షతో పాటు రెండువేల జరిమానా విధించినట్లు తెలిపారు. అదే విధంగా మిగిలిన ముగ్గురికి కలిపి రూ.4500 జరిమానా విధించినట్లు సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ ఆర్. సాయిరాం తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. వాహనాలు నడిపే వారు విధిగా నిబంధనలు పాటించాలన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

గరిడేపల్లి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ చలి గంటి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం రాయినిగూడెం గ్రామానికి చెందిన గుండు మహేష్ (36) కొన్ని సంవత్సరాలుగా కీతవారిగూడెం హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో పంపు ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసై పనికి వెళ్ల కుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఇంట్లో ఆర్థిక సమస్యలతో జీవితంపై విరక్తి చెంది ఉదయం భార్య కూరగాయల తెచ్చేందుకు బయటికి వెళ్లడంతో ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సంధ్యావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తల్లిదండ్రులు మందలించారని..

గుర్రంపోడు: మద్యానికి బానిసయ్యాడని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని తేరాటిగూడెంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ మధు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నారగోని సురేందర్(20) మద్యానికి బానిసై ఇంటికి వస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం మద్యం మత్తులో ఇంటికి వచ్చాడు. మద్యం తాగితే ఆరోగ్యం క్షీణిస్తుందని తల్లిదండ్రులు మందలించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సురేందర్ సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు 108లో చికిత్సనిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అర్చక, ఉద్యోగులకు వరాల జల్లు

(5వ పేజీ తరువాయి)

రూ.2 లక్షలు రుణం ఇవ్వనున్నారు. ఉపనయనం గ్రాంట్ రూ.50వేలు, మరణాంతరం రూ.50వేలు, అంతిమ సంస్కారాలకు రూ.30వేలు చెల్లించనున్నారు.

ఇంటి నిర్మాణానికి రెగ్యూలర్ ఉద్యోగులకు కన్సాలిడెంట్, డీడీఎన్ఎస్ అర్చకులకు రూ.50వేల గ్రాంట్, రెగ్యూలర్ ఉద్యోగులకు రుణం కింద రూ.10లక్షలు బ్యాంకు నుంచి పొందిన రుణం నుంచి వడ్డీ మొత్తం 10 ఏళ్ల వరకు ఏడబ్ల్యూఎఫ్‌టీ నుంచి చెల్లించనున్నారు. ఇంటి మరమ్మతు కోసం డీటీఎన్ అర్చకులకు రూ.30వేలు, రెగ్యూలర్ ఉద్యోగులకు రూ.4లక్షలు, గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్, పీహెచ్‌డీలకు ప్రతి విద్యా సంవత్సరం ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.35వేలు, డీడీఎన్ అర్చకులకు, రెగ్యూలర్ ఉద్యోగులకు రూ.5లక్షలు ఇవ్వనున్నారు. దివ్యాంగులైన ఉద్యోగులకు ఆర్థిక సాయం కింద 5 నుంచి 10 ఏళ్ల సేవలు అందించిన వారికి రూ.లక్ష, 10 ఏళ్లకు పైనా సేవలందిస్తే రూ.2లక్షలు ఆర్థికసాయం అందించనున్నారు.

ప్రభుత్వం అర్చకుల సంక్షేమానికి కృషి



అర్చకులు సంక్షేమ ఉద్యోగుల సంక్షేమ నిధి ట్రస్టు నుంచి రాష్ట్ర ప్రభుత్వం అర్చకుల కోసం సంక్షేమ పథకాలను అమలుచేయడం హర్షించదగ్గ విషయం. రాష్ట్ర ప్రభుత్వం నిధి ట్రస్టు ద్వారా విద్య, వైద్యం, వివాహ, ఉపనయనం, దహన సంస్కారాలకు, దివ్యాంగులైన అర్చకులకు ఆర్థిక సహకారం అందించేందుకు ముందుకు రావడం అభినందనీయం. మారుతున్న కాలానుగుణంగా ఆర్థికస్థితిని మెరుగుపర్చడానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో యావత్ అర్చక సమాజం సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి, ఇతర రాష్ట్ర మంత్రులు, దేవదాయ శాఖ అధికారులు చేసిన కృషితో ప్రయోజనం చేకూరింది.

● వాసుదేవశర్మ, డీడీఎన్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం: డీడీఎన్ఎస్



సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న అర్చక సంఘం నాయకులు

నల్లగొండ కల్చరల్: రాష్ట్రంలోని దేవాదాయశాఖ అర్చక, ఉద్యోగులకు, ధూపదీప నైవేద్యం అర్చకుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేయడం హర్షణీయమని డీడీఎన్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవశర్మ అన్నారు. మంగళవారం దేవాదాశాఖ అర్చకుల, డీడీఎన్ఎస్ సంఘాల ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని దేవాదాయశాఖ కార్యాలయం ఆవరణలో సీఎం, దేవాదాయశాఖ మంత్రి, రాష్ట్ర మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్చకులకు, డీడీఎన్ఎస్ అర్చకుల సంక్షేమానికి అర్చక సంక్షేమ నిధి నుంచి విద్య, వైద్యం, వివాహ గ్రాంట్, ఉపనయనం గ్రాంట్, దహన ఖర్చుల గ్రాట్యూటీ, అంగ వికలాంగులైన వారికి ఆర్థిక సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణశర్మ, గోవిందుమిశ్ర, వావిలాల రామలింగయ్య శర్మ, లక్ష్మీనరసింహమూర్తి, అంబటి నాగిరెడ్డి, భరద్వాజ, పండు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

డిండి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఈత సరదా విద్యార్థి ప్రాణం తీసింది. ఈ సంఘటన నల్లగొండ జల్లా డిండి మండలం నగరదుబ్బతండాలో సోమవారం సాయంత్రం జరిగింది. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం... తండాకు చెందిన ఐదుగురు స్నేహితులు సోమవారం సాయంత్రం తండాకు సమీపంలో ఉన్న మిట్టోనికుంటకు స్నానానికి వెళ్లారు. కరంటోతు సిద్దు(13) ముందుగా స్నానం చేసేందుకు నీటిలోకి దిగాడు. అప్పటికే కుంటలో మట్టికోసం తీసిన గోతులు ఉండడంతో నీటిలోకి దిగిన సిద్దు ఈతరాకపోవడంతో నీటమునిగిపోయాడు. ఒడ్డున ఉన్న స్నేహితులు భయంతో తండాకు చేరుకున్నారు. సిద్దు నీటమునిగి చనిపోయిన విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పలేదు. చీకటిపడినప్పటికీ తన కుమారుడు ఇంటికి రాకపోవడంతో సిద్దు తండ్రి కరంటోతు చందు అన్ని చోట్ల వెతికినప్పటికీ ఆచూకీ దొరకలేదు. ఐదుగురు స్నేహితులు కలిసి కుంట ఒడ్డున ఉండడాన్ని చూసిన కొందరు తండావాసులు మంగళవారం ఉదయం సిద్దు వెంట వెళ్లిన పిల్లలను నిలదీయడంతో నీట మునిగిపోయినట్లు చెప్పారు. కుటుంబ సభ్యులు కుంట వద్దకు వెళ్లి చూడగా నీటిపైన సిద్దు మృతదేహం తేలాడుతూ ఉండడంతో ఒడ్డుకు చేర్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వంశీ తండ్రి చంద్రు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. వంశీ కల్వకుర్తిలోని ఓ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు.

పీసీసీ కార్యవర్గంలో ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యం

(5వ పేజీ తరువాయి)

బీసీ యువనేత వట్టికూటి రామారావుగౌడ్‌కి ప్రధాన కార్యదర్శిగా ఈ కార్యవర్గంలో ఛాన్స్ దక్కింది. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కీతవారిగూడానికి చెందిన రామారావు వామపక్ష విద్యార్థి సంఘాల్లో క్రియాశీలకంగా పనిచేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఓయూ జేఏసీ నాయకుడిగా క్రియాశీలకంగా పనిచేసిన ఆయన బీసీ సామాజిక ఉద్యమాల్లో పనిచేశారు. హైకోర్టు న్యాయవాదిగా పనిచేస్తున్న ఆయన కొంతకాలం క్రితం కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా ఆయన్ను పీసీసీ ప్రధాన కార్యదర్శి పదవి వరించింది.

పీసీసీ ఉపాధ్యక్ష పదవిపై గుమ్మల నారాజ్

పీసీసీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన గుమ్ముల మోహన్‌రెడ్డి ఈ పదవి తీసుకోవడానికి సుముఖత చూపడం లేదని తెలుస్తోంది. కేడర్ సైతం ఆయన్ను ఈ పదవి తీసుకోవద్దని ఒత్తిడి తెస్తున్నట్లు నల్లగొండ కాంగ్రెస్‌లో చర్చ సాగుతోంది. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అనుచరుడైన మోహన్‌రెడ్డి పార్టీలో ఎన్ఎస్‌యూఐ నుంచి పార్టీలో అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చారు. జడ్పీటీసీ సభ్యుడిగా పనిచేసిన ఆయన ఉమ్మడి జిల్లా యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం పనిచేశారు. ప్రస్తుతం నల్లగొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయనకు పార్టీ నేతలందరితో సాన్నిహిత్యముండడంతో పాటు, కేడర్‌తో విస్తృత స్థాయి సంబంధాలున్నాయి. పార్టీ అధికారంలో లేని సంక్షోభ సమయంలోనూ పార్టీని వీడకుండా కొనసాగడమే కాకుండా, కార్యకర్తలను పార్టీ వీడకుండా కాపాడిన వ్యక్తిగా మోహన్‌రెడ్డికి పార్టీలో పేరుంది. పార్టీకి వీరవిధేయుడిగా పేరున్న మోహన్‌రెడ్డికి రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవి రాబోతోందని మంత్రి వెంకటరెడ్డి లోక్‌సభ ఎన్నికల సందర్భంలో కార్యకర్తల సమావేశంలో ప్రకటించగా, ఆయనకు కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఖాయమని భావించారు. ఈ నేపథ్యంలో డీసీసీ అధ్యక్షపదవికి సైతం ఇటీవల ఆయన పేరుని అధిష్టానం పరిశీలించింది. జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉండే నేతగా, పార్టీ వ్యవహారాలను, కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించే నాయకుడిగా గుర్తించి డీసీసీ బాధ్యతలివ్వాలని జిల్లానేతలు సూచించగా, కీలకమైన పదవి ఇవ్వాలని కేడర్ అభిప్రాయపడింది. ఈ పరిస్థితుల్లో అయితే రాష్ట్ర కార్పొరేషన్ పదవి, లేకపోతే డీసీసీ అధ్యక్ష పదవి ఖాయంగా వస్తుందని భావిస్తున్న తరుణంలో అనూహ్యంగా మోహన్‌రెడ్డికి పీసీసీ ఉపాధ్యక్షపదవి రావడంపై నల్లగొండ పార్టీశ్రేణుల్లో నైరాశ్యం నెలకొంది. ఈ పదవి స్వీకరించవద్దనే అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి. ఆశించని పదవిని ఎందుకిచ్చారనే అంశంపై తర్జనభర్జనపడుతున్నారు.

ఇంటి పేరు తెచ్చిన తంటా..

మోత్కూరు: కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శుల జాబితాలో పేరు పక్కన ఇంటి పేరు లేకపోవడంతో ఇద్దరు నాయకులు ఆ పదవి నాదేనంటే నాదే అని చెప్పుకున్నారు. కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సోమవారం టీపీసీసీ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అందులో రాష్ట్ర ప్రధాన కార్యదర్శుల్లో ఒక పేరు ఉపేందర్‌రెడ్డి అని ఉంది. ఆ పేరు పక్కన ఇంటి పేరు లేదు. దీంతో మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు చింతల ఉపేందర్‌రెడ్డి తనకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చారని చెబుతుండగా, ఆలేరు నియోజక వర్గం పరిధిలోని కొల్లూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జనగామ ఉపేందర్‌రెడ్డి తనకే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చారని చెబుతున్నారు. ఇద్దరూ ఎవరికి వారు ఆ జాబితాలో ఉన్నది తన పేరేనని చెబుతున్నారు. ఇద్దరూ ఒకరి తర్వాత ఒకరు వెళ్లి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఇద్దరు నాయకులు తానే రాష్ట్ర ప్రధాన కార్యదర్శినని చెబుతుండడంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అయోమయానికి గురయ్యారు. ఈ విషయమై యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డిని అడగ్గా ఏఐసీసీ నుంచి వచ్చిన జాబితా అయినందున రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎవరు నియమితులయ్యారని పార్టీ నాయకత్వమే చెబుతుందన్నారు.

పీసీసీ ప్రధాన కార్యదర్శిగా జనగాం ఉపేందర్‌రెడ్డి

ఆలేరు రూరల్: పీసీసీ ప్రధాన కార్యదర్శిగా యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని కొల్లూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జనగాం ఉపేందర్‌రెడ్డిని నియమిస్తూ మంగళవారం పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ నియామకపత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఉపేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నల్లగొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం నల్లగొండ పట్టణంలోని ఎస్ఎల్‌బీసీ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కట్టంగూరు మండలం ముత్యాలమ్మగూడెం గ్రామానికి చెందిన జాలా వంశీ(22), తిలక్ నల్లగొండ నుంచి ఎస్ఎల్బీసీ వైపు బైక్‌పై వెళ్తుండగా, హాలియా నుంచి నల్లగొండకు వస్తున్న కారు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. దీంతో వంశీ అక్కడికక్కడే మృతిచెందాడు. తిలక్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు.

నిర్వాహకులను బయటికి నెట్టి

మద్యం దుకాణానికి తాళం

మోత్కూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలకేంద్రంలోని బాల ఉగ్ర నర్సింహస్వామి వైన్స్ దుకాణాన్ని కొందరు మంగళవారం మధ్యాహ్నం మూయించి తాళాలు వేసి వెళ్లిపోయారు. వారు వైన్స్ దుకాణం వద్దకు వెళ్లి ఓ వీడియో వైరల్ కావడానికి మీ దుకాణానికి సంబంధించిన వ్యక్తులే కారణమంటూ దుకాణంలో ఉన్న వారిని బయటకు నెట్టి వైన్స్ దుకాణానికి తాళాలు వేశారు. తమను బయటకు నెట్టిన వారు ఎవరన్నది గుర్తించలేదని వైన్స్ సిబ్బంది తెలిపారు. నిర్వాహకులు ఎక్సైజ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎక్సైజ్ ఎస్ఐ సత్యనారాయణ దుకాణం వద్దకు వెళ్లి పరిశీలించారు. సివిల్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. దుకాణం నిర్వాహకుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం ఎస్ఐ వైన్స్ దుకాణాన్ని తెరిపించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

తిరుమలగిరి,జూన్10(ఆంధ్రజ్యోతి): విత్తన డీలర్లు నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ గౌస్ హెచ్చరించారు. మంగళవారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో ఫెర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. పత్తిగింజల శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపామన్నారు.

విద్యా వికాసం పెరగాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేలా వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా విద్యార్థుల్లో విద్యతో పాటు వికాసం లక్ష్యంగా 2025-26 సంవత్సరానికి చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో యోగా, ధ్యానం, అరగంట పాటు కథలు, పత్రికలు చదివించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా నెలలో మూడో శనివారం నోబ్యాగ్ డే అమలు చేయనుంది. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

• ఆంధ్రజ్యోతి, సూర్యాపేటటౌన్

విద్యా వికాసం పెరుగుతుంది



రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. దీనివల్ల విద్యతో పాటు విద్యార్థుల్లో వికాసం పెరుగుతుంది. నిత్యం చదువులతో కుస్తీ పట్టే పిల్లలకు చాలా మేలు జరుగుతుంది. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలి. ఆటలు, పాటలు విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టి ధైర్యాన్ని ఇస్తాయి. పరీక్షలంటే ఉండే భయం యోగా, ధ్యానంతో దూరమవుతుంది.

• కట్ట కల్పన, పేరెంట్ సూర్యాపేట.

క్షేత్రస్థాయిలో అమలు చేయాలి



ప్రభుత్వ నిర్ణయం కేవలం ప్రకటనకు పరిమితం కాకుండా చూడాలి. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఈ విధానాన్ని అమలు చేసి విద్యార్థులకు మేలు చేయాలి. ఐదు నిమిషాలు యోగా, అరగంట వివిధ పత్రికలు, కథలు చదవించడం బాగుంటుంది. వీటితో పాటు ప్రతి శనివారం విద్యార్థుల్లో ఉన్న సృతనాత్మకత వెలుగులోకి వచ్చేలా వ్యాసరచన, వకృత్యం, క్విజ్ పోటీలు ఏర్పాటు చేయాలి. మూడో శనివారం నోబుక్స్, నోబ్యాగ్ నిర్ణయం కఠినంగా అమలు చేయాలి.

• ఎర్ర అఖిల్‌కుమార్, పీడీఎస్‌యూ నాయకుడు

విద్యార్థుల్లో చురుకుతనం పెరుగుతుంది



ప్రభుత్వం నిర్ణయంతో విద్యార్థుల్లో చురుకుతనం పెరుగుతుంది. కేవలం చదువే కాకుండా యోగా, ధ్యానం, కథల పఠనం నిర్ణయం బాగుంది. మూడో శనివారం నోబుక్స్ మంచి నిర్ణయం. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల హాజరుశాతం పెరుగుతుంది. విద్యార్థుల బట్టి చదువులకు తెరపడే అవకాశం ఉంది. సెలబస్ సైతం త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు పరీక్షలంటే భయం పోయేలా కార్యక్రమాలు చేపట్టాలి. స్కూల్ సమావేశాలు 6 నుంచి 7వరకు పెంచడం బాగుంది. మా నిర్ణయాలు తెలిపే అవకాశం ఉంది.

• సయ్యద్ హుస్సేన్, పేరెంట్, నేరేడుచర్ల.

ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయి



ప్రభుత్వం 2025-26 విద్యాసంవత్సరానికి తీసుకున్న నిర్ణయం బాగుంది. ప్రభుత్వ బడులు బలోపేతం అవుతాయి. విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. యోగా, ధ్యానంతో చదువులో ఉన్న ఒత్తిడి పూర్తిగా పోయే అవకాశముంది. పత్రికలతో సమాజంలో జరిగే అనేక విషయాలు విద్యార్థులు నేర్చుకునే అవకాశముంది. పిల్లలపై దృష్టి పెట్టి యోగా, ధ్యానంతో వారికి ధైర్యం నింపాలి.

• సూరం రేణుక, పేరెంట్, సూర్యాపేట.

పర్యావరణం కస్తూరి పథం



విద్యార్థులకు జూట్ బ్యాగులు పంపిణీ చేస్తున్న కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ శ్రీచరణ్(ఫైల్)

- పర్యావరణ పరిరక్షణకు కస్తూరి ఫౌండేషన్ కార్యచరణ
- గ్రామాలు, పట్టణాల్లో జూట్, క్లాత్ బ్యాగుల పంపిణీ
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాలు

నల్లగొండ/గట్టుప్పల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా ఇప్పటికే అనేక సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న కస్తూరి ఫౌండేషన్ ఈ ఏడాది నుంచి పర్యావరణ పరిపరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టనుంది. ప్రజల అవసరాలను తీర్చడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, విద్యా, వైద్యం ఇంకా ఇతర సంక్షేమ కార్యక్రమాలను పెద్దఎత్తున చేపడుతోంది. ప్రజల జీవన ప్రమా ణాలు మెరుగుపర్చడం వల్ల సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీచరణ్ విశ్వసిస్తారు. పర్యావరణ పరిరక్షణకు జ్యూట్ బ్యాగుల పంపిణీ చేస్తున్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొన్ని సంవత్సరాలుగా మట్టి గణపతి విగ్రహాలు సైతం పంపిణీ చేస్తూ సమాజ హితం కోసం సేవలందిస్తున్నారు కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీచరణ్. ఏ విద్యార్థీ పేదరికంతో చదువుకు దూరం కావొద్దనే ఉద్దేశంతో 2017 జూన్ 22వ తేదీన కస్తూరి ఫౌండేషన్‌ను స్థాపించారు. అప్పటినుంచి ఉమ్మడి నల్లగొండ, హైదరాబాద్, రంగారెడ్డి, కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో సుమారు వందకు పైగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రూ.20లక్షలతో మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించారు. రూ.8లక్షలతో నాలుగు కేంద్రాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆయా అంగన్‌వాడీల్లో ఆట వస్తువులు, విద్యుత్, చిన్నారులకు దుస్తులు సైతం అందజేశారు.

పర్యావరణ పరిరక్షణకు కంకణబద్ధులు కావాలి



పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులు కావాలి. భవిష్యత్ తరాలకు సురక్షిత, ఆరోగ్యకరమైన ప్రపంచాన్ని అందించడాన్ని బాధ్యతగా తీసుకోవాలి. మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామాలు, పట్టణాల్లో జూట్, క్లాత్ బ్యాగులు పంపిణీ చేస్తున్నాం. కాలుష్యం నుంచి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. దీంతో పాటు పచ్చదనాన్ని పెంచితే కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణ సమతుల్యాన్ని కాపాడవచ్చు. ప్లాస్టిక్ కవర్లు ఉపయోగించకుండా జూట్ బ్యాగులను ఉపయోగించడం వల్ల కాలుష్యాన్ని తగ్గించవచ్చు. వాయు, నీటి, నేల కాలుష్యాన్ని నియంత్రిచడం వల్ల పర్యారణాన్ని కాపాడవచ్చు.

- కస్తూరి శ్రీచరణ్, కస్తూరి ఫౌండేషన్ చైర్మన్

పేదింటి ఆడబిడ్డల కోసం..

తల్లిదండ్రులు లేనివారు, తల్లి లేక తండ్రి లేనివారు, కటిక పేదరికంలో ఉన్న ఆడబిడ్డల కోసం ఐదేళ్ల క్రితం కస్తూరి కల్యాణమస్తు కార్యక్రమానికి శ్రీచరణ్ శ్రీకారం చుట్టారు. దీని ద్వారా ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 50 మంది ఆడబిడ్డలకు రూ.15 లక్షల విలువైన పుస్తె, మెట్టలు అందజేసి ఆదుకున్నారు. రెండేళ్లుగా ఆయా విద్యా సంవత్సరం నుంచి వినూత్నంగా నోట్ పుస్తకాలిచ్చే ఏటీఎంకు రూపకల్పన చేశారు. ఏదైనా ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం తమ విద్యార్థులకు నోట్ పుస్తకాలు కావాలని లెటర్‌ప్యాడ్‌లో సంతకం చేసి వినతిపత్రం అందజేస్తే 24 గంటల్లో వారికి నోట్ బుక్స్ పంపిస్తారు. సర్కారు పాఠశాల విద్యార్థులు హెచ్ఎం ధ్రువీకరణతో నేరుగా నల్లగొండలోని శ్రీచరణ్ కార్యాలయానికి వచ్చి ఆధార్ కార్డు జీరాక్స్ అందజేసినా నోట్‌బుక్స్ ఇస్తారు. బాలికా విద్యను ప్రోత్సహించేందుకు మునుగోడు, సంస్థాన్‌నారాయణపురం, చౌటుప్పల్, తిరుమలగిరి కేజీబీవీల్లో రూ.20లక్షలతో మౌలిక వసతులు మెరుగుపరిచారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో వసతులను మెరుగుపరిచారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్లే స్కూల్స్ తరహాలో ఆదర్శంగా తీర్చిదిద్ది మార్పు అక్కడి నుంచే తీసుకరావాలని నిర్ణయించి అందుకు అనుగుణంగా కృషిచేస్తున్నారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులను ప్రోత్సహిస్తున్నారు. విద్యారంగంతో పాటు ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

నిర్వాసితులందరికీ పరిహారం, పునరావాసం

ఎమ్మెల్యే బాలునాయక్



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నక్కలగండి ఎత్తిపోతల భూనిర్వాసితులకు పరిహారం చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్, ఆర్డీవో రమణారెడ్డి, ఎస్ఈ బద్రునాయక్

దేవరకొండ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): డిండి ఎత్తిపోతల, నక్కలగండి ఎత్తిపోతల పథకంలో భూములు, ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులందరికీ పూర్తిస్థాయిలో పరిహారం, పునరావాసం కల్పిస్తామని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. పెద్దగట్టు ముంపు స్కీం భూనిర్వాసితులు 10 మందికి రూ.13లక్షలు, అంభభవాని ఎత్తిపోతలలో భూములు కోల్పోతున్న నిర్వాసితులు 30 మందికి రూ.32 లక్షలు, నక్కలగండి ముంపు బాధితులు 9 మందికి రూ.84లక్షలు పరిహారం చెక్కులను మంగళవారం దేవరకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఎస్ఎల్‌బీసీ, డిండి ఎత్తిపోతల, నక్కలగండి ఎత్తిపోతల పథకాలను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పెద్దగట్టు, అంభ భవాని, నక్కలగండి ప్రాజెక్టుల భూనిర్వాసితులందరికీ పూర్తిస్థాయిలో పరిహారం, పునరావాసం కల్పిస్తున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దేవరకొండ నియోజకవర్గంలోని ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టుల నిర్మాణానికి భూనిర్వాసితులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, డిండి ఎత్తిపోతల ప్రాజెక్టు ఎస్ఈ బద్రునాయక్, డీఈలు నెహ్రూ, సత్యనారాయణ, రాములునాయక్‌పాల్గొన్నారు.

ఎస్ఎల్‌బీసీ, డిండి, నక్కలగండి ప్రాజెక్టులపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి

దేవరకొండ నియోజకవర్గంలోని శ్రీశైలం సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల, నక్కలగండి ప్రాజెక్టులపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే బాలునాయక్ తెలిపారు. నీటిపారుదలశాఖ, రెవెన్యూ, అటవీశాఖ అధికారులతో ప్రాజెక్టుల పురోగతిపై మంగళవారం దేవరకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. త్వరలో నక్కలగండి, పొగిళ్ల, పెద్దగట్టు, కంభాలపల్లి లిఫ్టు స్కీంలకు అడ్డంకులు తొలగిపోతాయని, అటవీశాఖ అనుమతులు వస్తాయని తెలిపారు. అధికారులు ప్రాజెక్టుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించి భూనిర్వాసితులకు పరిహారం, పునరావాసం పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏకేబీఆర్, అంభ భవాని ఎత్తిపోతల పథకాల పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డిండి ఎత్తిపోతల ఎస్ఈ బద్రునాయక్, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, డీఎఫ్‌వో రాజశేఖర్, సంగీత, ఈఈలు సత్యనారాయణ, నెహ్రూ, రాములునాయక్, యాదన్‌కుమార్, చక్రపాణి పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

• తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు



శాలిగౌరారం ప్రాజెక్ట్ నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సామేలు

శాలిగౌరారం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం ప్రాజెక్టు నీటిని ఆయకట్టు రైతాంగం పొదుపుగా వాడుకోవాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా శాలిగౌరారంలో శాలిగౌరారం ప్రాజెక్ట్ నీటిని కుడి, ఎడమ కాల్వల ద్వారా నీటిని విడుదల చేశారు. రైతుల ప్రయోజనాల కోసం విడుదల చేసిన నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 21 అడుగులు కాగా ప్రస్తుతం ప్రాజెక్ట్ పూర్తి స్థాయిలో నిండినందున వానాకాలం సాగు కోసం విడుదల చేసినట్లు తెలిపారు. ఆయకట్టు కింద సుమారు ఐదు వేల ఎకరాల్లో భూములు సాగులోకి వస్తాయన్నారు.

ఎనిమిది కాళ్లతో గొర్రె పిల్ల జననం



ఎనిమిది కాళ్ల గొర్రె పిల్ల

వలిగొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని ముద్దాపురం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి ఆవుల యాద య్యకు చెందిన ఒక గొర్రెపిల్ల ఎనిమిది కాళ్లతో జన్మనిచ్చింది. దానిని గ్రామస్థులు ఆసక్తిగా తిలకించారు. జన్యుపరమైన లోపమని వెటర్నరీ అధికారులు తెలిపారు. పుట్టిన వెంటనే గొర్రెపిల్ల మృతి చెందింది.

పోటీల ద్వారానే ప్రతిభ వెలుగులోకి

• డీవైఎస్‌వో కుంభం నర్సిరెడ్డి

నల్లగొండ స్పోర్ట్స్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పోటీల ద్వారానే బాలబాలికల ప్రతిభ వెలుగులోకి వస్తుందని జిల్లా యువజన క్రీడల అధికారి కుంభం నర్సిరెడ్డి అన్నారు. ది తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ నల్లగొండ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని విన్నర్స్ వరల్డ్ తైక్వాండో అకాడమీలో ఉమ్మడి నల్లగొండ జిల్లా తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పోటీలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో యువతకు మార్షల్ క్రీడ ఎంతో అవసరమన్నారు. అనంతరం జరిగిన పోటీలకు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి వివిధ కేటగిరీలలో 200 మంది క్రీడాకారులు హాజరై క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. అత్యంత ప్రతిభ కనబర్చి గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ విమల, ది తైక్వాండో అసోసియేషన్ జిల్లా సెక్రటరీ యూనిస్ కమాల్, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విఠల్‌బాబు, ఆదిత్య, అబ్దుల్ మాలిక్, బాసిత్, అంబటి ప్రణీత్, నజీరోద్దిన్, మోహితుల్లా, సురేష్, ప్రదీప్, హరీష్, కోచ్‌లు పవన్, రమేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపిక పోటీలు

నల్లగొండ స్పోర్ట్స్ జూన్ 10 (ఆంధ్రజ్యోతి): హైదారాబాద్‌లోని హకీంపేట క్రీడా పాఠశాలలోని 4వ తరగతిలో ప్రవేశానికి మండల, జిల్లా స్థాయి ఎంపిక పోటీలు ఈ నెల 16వ తేదీ నుంచి 26 తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి కుంభం నర్సిరెడ్డి తెలిపారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని మండల విద్యాధికారులకు సమాచారం ఇచ్చామని, వారి ఆధ్వర్యంలో మండల స్థాయి ఎంపిక పోటీలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి ఉన్న 3వ తరగతి పాస్ అయిన బాల, బాలికలు ఆన్‌లైన్‌లో ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 16నుంచి 19 వరకు మండల స్థాయిలో, 24నుంచి 25 వరకు జిల్లా స్థాయిలో జిల్లా కేంద్రంలోని మేఖల అభినవ్ స్టేడియంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మండల స్థాయిలో ఎంపికై వారికి , జిల్లా స్థాయిలో 30 మీటర్లు ఫ్లయింగ్ స్టార్స్, 800 మీటర్ల పరుగు పందెం, షటిల్ రన్, త్రో బాల్, వర్టికల్ జంప్, ఎత్తు, బరువు వంటి దేహదారుఢ్యానికి సంబంధించి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. పూర్తి వివరాలకు కోసం 9440072854 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కమిటీ మెంబర్ వీరయ్యపై దాడి

నాగారం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నాగారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకుడు ఇందిరమ్మ ఇళ్ల కమిటీ మెంబర్ జాజుల వీరయ్య పై అదే పార్టీకి చెందిన కొందరు మంగళవారం దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం మండల కేంద్రంలో 24 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ఈ ఇళ్ల ఎంపిక విషయమై ఎంపీడీవోకు వినతిపత్రం అందజేయడానికి వచ్చిన ఇందిరమ్మ కమిటీ సభ్యుడు జాజుల వీరయ్య వచ్చారు. సమా చారం తెలుసుకున్న మరో వర్గం నాయకులైన కన్నెబోయిన వెంకట భిక్షం, పాల్వాయి పరశురాములు, చిప్పలపల్లి సోమయ్య, గద్దల సైదులు వచ్చి వీరయ్యను దూషించి తీవ్రంగా గాయపర్చారు. అక్కడే స్పృహ స్పృహ తప్పి పడిపోయిన వీరయ్యను కాంగ్రెసు కార్యకర్తలు సూర్యాపేట లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వీరయ్యకు కాలు బోను చిట్లింది. తొంటిపైన, కుడి భుజంపై గాయాలైయ్యాయిఆస్పత్రి నుంచి కారులో వచ్చిన వీరయ్య నాగారం పిఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నాగారం సీఐ రఘువీరారెడ్డి తెలిపారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు



క్షేత్రపాలకుడికి హారతి సమర్పిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్ర పాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసి, తమల పాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచారాత్రగమశాస్త్ర రీతిలో నిర్వహించారు. శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామికి ముఖ మండపంలోని స్పటిక మూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. పాత గుట్ట ఆలయంలో ఆంజనేయ స్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేశారు.. కాగా, స్వామివారిని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, చత్తీస్‌ఘడ్‌కు చెందిన ఐపీఎస్ అక్షయ్, ఒడిసా రాష్ట్ర పూరి జగన్నాథ్ నియోజకవర్గం ఎమ్మెల్యే దిపాస్ పట్నాయక్ కుటుంబ సమేతంగా వేర్వేరుగా దర్శించుకున్నారు. గర్భాలయంలోని స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేశారు. వేద మండపంలో వారికి పండితులు వేద ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూ ప్రసాదం, స్వామివారి చిత్రపటం అందజేశారు. ఈ సందర్భంగా పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్ ఎమ్మెల్యే దిపాస్ పట్నాయక్ దంపతులకు శాలువాతో సన్మానించి స్వామివారి చిత్రపటం అందజేశారు. స్వామివారి హుండీ లెక్కింపు ఈ నెల 12వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఈవో ఎస్ వెంకట్రావు తెలిపారు. కొండకింద వ్రత మండ పాల్లో ఉదయం ఏడు గంటలకు లెక్కింపు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రకటించారు.



వేద మండపంలో పూజల్లో పాల్గొన్న ఐపీఎస్ అక్షయ్, కుటుంబ సభ్యులు

వైభవంగా శ్రీలక్ష్మీనృసింహుని కల్యాణం

మఠంపల్లి: ప్రసిద్ధ సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహుని క్షేత్రంలో మంగళవారం స్వామివారి నిత్యకల్యాణాన్ని వేదపండితులు కన్నుల పండువగా అత్యంత వైభవంగా నిర్వహించారు. పూజలు, కల్యాణం అనంతరం భక్తులకు నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరిమట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	511.90 అడుగులు
టీఎంసీలు	134.9183
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	నిల్
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	900 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	900 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	24.81 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	640.60 అడుగులు
టీఎంసీలు	3.35
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	357.52 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	87.88క్యూసెక్కులు

ఎమ్మెల్యే సామేలుపై ఆరోపణలు తగదు

మోత్కూరు/తుంగతుర్తి/శాలిగౌరారం/తిరుమలగిరి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలుపై కొంతమంది అసత్య ఆరోపణలు చేయడం సరికాదని పలువురు నేతలు అన్నారు. మంగళవారం మోత్కూరు, తుంగతుర్తి, శాలిగౌరారం, తిరుమలగిరి మండల కేంద్రాల్లో వారు విలేకరులతో మాట్లాడారు. సామేలుపై అసత్య ఆరోపణలు చేస్తున్నవారిని శిక్షించాలని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మందుల సామేలు తమను డబ్బులు అడగలేదని మోత్కూరు వైన్స్ దుకాణాల భాగస్వాములు, కాంగ్రెస్ నాయకులు ఎనగందుల స్వామి, బద్దం నాగార్జునరెడ్డి, కొణతం శ్రీను, చిలుకూరి పాపయ్య తెలిపారు. ఎమ్మెల్యే వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా వీడియో తీసి వైరల్ చేస్తున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తే సహించేది లేదని మోత్కూరు సింగిల్ విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ జిల్లా నాయకుడు డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు, ఎస్సీ, ఎస్టీ, బీసీ జిల్లా నాయకుడు చింత గణేష్ అన్నారు. కొందరు కావాలనే బలహీన వర్గాల నాయకున్ని బద్నాం చేసే కుట్రలు పన్నుతున్నారని తిరుమలగిరి మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ ఎల్సోజు చామంతి నరేష్ ఆరోపించారు.

పీడిత హక్కుల కేతనం బాలగోపాల్

సీనియర్ హక్కుల నేత సుబ్బారావు



బాలగోపాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వివిధ ప్రజాసంఘాల నాయకులు

మిర్యాలగూడ, జూన్ 10(ఆంధ్రజ్యోతి):పీడితుల హక్కుల కేతనమై బాలగోపాల్ నిలిచారనిహక్కుల ఉద్యమ సీనియర్ నాయకుడు వి. సుబ్బారావు అన్నారు. బాల గోపాల్ జయంతిని పురస్కరించుకుని మంగళ వారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని సత్యావతి స్మారక గ్రంథిలయంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుబ్బారావుమాట్లాడుతూ మానవ హక్కుల కోసం బాలగోపాల్ నిరంతరం పోరాడారని అన్నారు. చట్టం రక్షణ కల్పించలేని చోట పీడితుల చేతిలో హక్కుల జండాగా నిలిచారన్నారు. కల్లోల పరిస్థితుల్లో రాజ్యాంగ కల్పించి హక్కులను కాపాడేందుకు 1998 అక్టోబరు 11న మానవహక్కుల వేదికను స్థాపించి నిరంతరం హక్కులకై పోరాడిన యోధుడని అన్నారు. తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య మాట్లాడుతూ కాకతీయ యూనివర్శిటీలో గణిత శాస్త్ర ప్రొఫెసర్‌గా, న్యాయవాదిగా కొనసాగుతూ ఎక్కడ మానవహక్కులకు భంగం కలిగితే అక్కడకు వెళ్లి నిజనిర్ధారణ చేపట్టి వాస్తవాలను ప్రజలకు చెప్పి హక్కుల పరిరక్షణకు ఉద్యమం చేపట్టేవాడని అన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు బాధితులకు అండగా నిలబడిన నిరంతర హక్కుల బాటసారి బాలగోపాలు అని కొనియాడారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ బీసం రామయ్య, రాముడుశర్మ, కుందా శ్రీనివాస్, గణేష్, భిక్షమయ్య, కిరణ్మయి, సరోజ, జ్వాల, బెల్లంకొండ హరి, హఫీజ్, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి సుదర్శన్, ఇతర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకులకు గాయాలు

గరిడేపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు గాయపడ్డారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రంలో మంగళవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ప్రధాని గణేష్, చిక్కుల నవీన్‌లు ద్విచక్ర వాహనంపై వస్తుండగా, గరిడేపల్లి గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు ఒకరిని 108అంబులెన్సులో, మరొకరిని ఆటోలో మి ర్యాలగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఎస్సీ హాస్టల్‌లో దరఖాస్తుల ఆహ్వానం

కట్టంగూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కట్టంగూరులోని ఎస్సీ హాస్టల్‌లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వార్డెన్ గుజ్జుల శంకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కట్టంగూరులోని ఎస్సీ బాలుర వసతి గృహంలో 57 సీట్లు ఖాళీగా ఉన్నాయని, 3 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న ఎస్సీ విద్యార్థులు బోనఫైడ్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జతచేసి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 9848729854 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

ట్రాక్టర్ ఓనర్స్ అధ్యక్షుడు కాంగ్రెస్‌లో చేరిక

చిట్యాల, జూన్ 10, (ఆంధ్రజ్యోతి):బీఆర్ఎస్ నాయకుడు చిట్యాల ట్రాక్టర్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆగు నర్సింహ మంగళవారం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జడల చినమల్లయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట పలువురు పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఏర్పుల పరమేషం, కోనేటి కృష్ణ, ఆగు వెంకన్న, ఆగు లింగస్వామి, ఏర్పుల స్వామి పాల్గొన్నారు.

సా..గుతున్న ప్రధాన రోడ్డు పనులు

● నల్లగొండ పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డు డ్రైనేజీ నిర్మాణంలో తీవ్రజాప్యం ● రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు

నల్లగొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి):

జిల్లా కేంద్రంలోని మిర్యాలగూడ రోడ్డులోని బీటీఎస్‌లో ప్రధాన రోడ్డుపై డ్రైనేజీ, పైపులైన్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రకాశం బజార్‌తో పాటు జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రి, బస్టాండ్ నుంచి మిర్యాలగూడ వైపు, కలెక్టరేట్‌కు వెళ్లే ఈ దారిలో ప్రధాన మురుగు కాల్వకు సంబంధించిన పనులు నడుస్తున్నాయి. వాస్తవానికి అయితే ఒకవైపు పను లు పూర్తి చేసిన తరువాత మరోవైపు తొవ్వాల్సి ఉన్నప్పటికీ రోడ్డు మొత్తం మూసి వేసి పనులు చేపడుతున్నా డ్రైనేజీ పనులు సకాలంలో పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహిస్తుండడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయ ఏర్పడుతుంది. ఈ దారి వెంటనే కలెక్టరేట్‌తో పాటు ఆర్డీవో కార్యాలయానికి, కలెక్టరేట్ అవతల, ఇవతల ఉండే కాలనీలకు ప్రజలు రాకపోకలు సాగించడానికి అవస్థలు పడుతున్నారు. పనులు నత్తనడకన సాగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిత్యం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ఉద్యోగులు, ప్రజలకు సైతం కార్యాలయాలకు వెళ్లడానికి సమస్యలు తప్పడం లేదు. గత నెలరోజులుగా ఈ సమస్యలను ప్రజలు ఎదుర్కొంటున్నారు. సదరు కాంట్రాక్టర్ పనులను పక్కన పెట్టడం తో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

వీధుల నుంచి వాహనాల రాకపోకలు

ప్రధాన రోడ్డులో పనులు పూర్తికాక పోవడంతో పాటు కనీసం ద్విచక్ర వాహనం కూడా వెళ్లేదారి లేకుండా కాంట్రాక్టర్ రోడ్డుపైన మొత్తం ఇరువైపులా మట్టిపోయడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి ఎదురు రోడ్డు నుంచి, ప్రకాశం బజార్ నుం చి వస్తున్న ప్రజలు, వాహనదారులతో పాటు మిర్యాలగూడ వైపు



నల్లగొండ జిల్లా కేంద్రంలోని మిర్యాలగూడ రోడ్డులో డ్రైనేజీ కోసం తవ్విన రోడ్డు

నుంచి వస్తున్న వాహనదారులు, ప్రజలు రోడ్డు అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ పనుల పక్క వీధుల నుంచి వందలాది వాహనాలు వెళ్తు న్నాయి. దీంతో ఆ వీధులోని ప్రజలు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి ఇరుకైనా రోడ్డుల నుంచి ఆటోలు, ద్విచక్ర వాహనాలు, కార్లు పెద్ద ఎత్తున వెళ్తుడడడంతో ఆ వీధుల్లో నివాసం ఉంటున్న ప్రజలు ప్రమాదాలు జరుగుతాయన్నా భయంతో ఉన్నారు. చిన్న పిల్లలు రోడ్డు ఎక్కితే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 12వ తేదీ నుంచి పునఃప్రారంభమవుతున్నందున విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడానికి కూడా ఇబ్బందులు అయ్యే అవకాశాలు ఉన్నాయి.

వెంటనే పనులు పూర్తి చేయాలి



డ్రైనేజీ పనులు చేపట్టి నెలరోజులు అవుతున్న పూర్తి చేయడం లేదు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డు వెంటనే పలు కార్యాలయాలు ఉన్నాయి. రెండు వైపుల తవ్వడంతోనే రాకపోకలకు సమస్యగా మారింది. పట్టణానికి కొత్తగా వచ్చిన వాహనదారులు దారి తెలియక సతమతమవుతున్నారు. రేపటి నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొనున్నారు. అధికారులు వెంటనే స్పందించి పనులు పూర్తి చేయాలి.

కత్తుల జయచందన్, నల్లగొండ

దివ్యాంగులం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



దివ్యాంగులమైన తాము వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చినప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని రోజులుగా తాము ఈ రోడ్డు వెంట వచ్చినప్పుడల్లా గల్లీ నుంచి వెళ్లాల్సి వస్తుంది. ప్రమాదాలు జరుగుతాయోనని భయంగా ఉంది. వెంటనే పనులు పూర్తి చేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి. రోడ్డుకు ఇరువైపులా తవ్వడం వల్లనే సమస్య అవుతుంది. అధికారులు చర్యలు చేపట్టి ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా చూడాలి.

-ఎం.ఎ. గఫూర్, మాడ్గులపల్లి

విద్యుత్ బిల్లుల బకాయిలను చెల్లించాలి

● రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆశయ్య



కరపత్రం అవిష్కరిస్తున్న రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆశయ్య, నాయకులు

నల్లగొండ రూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : వృత్తి దారులకు ఉచిత పథకాలు ద్వారా అందిస్తున్న విద్యుత్ బిల్లుల బకాయిలను వెంటనే చెల్లించాలని రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూన్ 17 హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద చేపట్టిన రజక వృత్తిదారుల ధర్నా కరపత్రం మంగళవారం స్థానిక అంబేడ్కర్ భవనంలో కరపత్రం అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ అందిస్తున్న పథకంలో విద్యుత్ అందించకుండా అధిక బిల్లు వేస్తూ విద్యుత్ అధికారుల వేధింపులకు గురిచేస్తున్నారని అన్నారు. అందుకు రజక సంఘం ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోసం ధర్నా చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు చెరుకు పెద్దులు, యాదయ్య, చేతి వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ గంజి మురళీధర్, నరేష్, సైదులు, శ్రీనివాస్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా దైద రవీందర్



నకిరేకల్, జూన్ 10, (ఆంధ్రజ్యోతి) : టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నకిరేకల్ పట్టణానికి చెందిన దైద రవీందర్‌ను నియామకమయ్యారు. పదేళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. నూతనంగా నియామకమైన దైద రవీందర్ మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ముందస్తు బడిబాట రాష్ట్రంలోనే ఆదర్శం

మేక నాగయ్య,ఎంఈవో, నకిరేకల్



ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి, బడి బయటి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడానికి నకిరేకల్‌లో చేపట్టిన ముందస్తు బడిబాట రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచినట్లు నకిరేకల్ ఎంఈవో మేక నాగయ్య తెలిపారు. బడి బాట గురించి మంగళవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇంటర్వ్యూలో పలు వివరాలు వెల్లడించారు.

(ఆంధ్రజ్యోతి- నకిరేకల్)

ఆంధ్రజ్యోతి: ముందస్తు బడిబాటలో ఏం సాధించారు

ఎంఈవో : నకిరేకల్‌లో ముందస్తుగా నిర్వహించిన బడిబాటలో రాష్ట్రంలోనే నకిరేకల్ ఆదర్శంగా నిలిచింది. మార్చి 17న బడిబాట సుప్రారంభించాం. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన లభించింది.

ఆంధ్రజ్యోతి: ముందస్తు బడిబాటలో ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయి

ఎంఈవో: మండలంలో పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించేందుకు చాలా కృషి చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరానికి 400 మందికి పైగా పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేస్తున్నాం. అందుకు పిల్లల తల్లిదండ్రులు సహకరిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి : ప్రభుత్వ పాఠశాలలు ఎప్పటి నుంచి ప్రారంభమవుతున్నాయి. విద్యార్థులకు ఎలాంటి సూచనలు ఇస్తున్నారు.

ఎంఈవో : ఈ నెల 12న ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభిస్తున్నాము. ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఐక్యంగా కృషి చేస్తున్నాము. విద్యార్థిని విద్యార్థులకు నోట్ పుస్తకాలు, యూనిఫామ్‌లు సిద్ధంగా ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి : ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు ఆంగ్లమాధధ్యం బోధిస్తున్నారా...

ఎంఈవో : అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్లమాధ్యమం విద్య బోధించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాము. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నాము. విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించి మాకు సహకరించాలి.

గ్రామ పంచాయతీలకు ఆదాయం పెంచాలి



శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, జూన్ 10, (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు ఆదాయం పెంచే విధంగా కార్యదర్శులు కృషి చేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ శివారులోని పత్తి మిల్లులో పారిశుధ్యం, తడిచెత్త, పొడిచెత్తపై మంగళవారం జరిగిన గ్రామపంచాయతీ కార్యదర్శుల శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు గ్రామపంచాయతీలను మరింత బలోపేతం చేసేందుకు ఆదాయం పెంచాలన్నారు. పారిశుధ్యం, తడిచెత్త, పొడిచెత్త సేకరణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్, వర్మికంపోస్ట్ తయారీపై మండల పంచాయతీ కార్యదర్శులు మల్టీపర్పస్ వర్కర్లకు ఒకరోజు శిక్షణ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తడి, పొడి చెత్తలను వేరు వేరుగా సేకరించి పారిశుధ్యం నిర్వాహణపై క్షేత్రస్థాయి పర్యటన తప్పకుండా ఉండాలన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులను ఘనంగా సన్మానించి వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో డీపీవో వెంకయ్య, డీఎల్‌పీవోలు శంకర్‌నాయక్, వెంకటేశ్వర్లు, నకిరేకల్, కట్టంగూరు, కేతేపల్లి, నార్కట్‌పల్లి ఎంపీడీవోలు చంద్రశేఖర్, జ్ఞాన ప్రకాష్, జయలక్ష్మి, శ్రీనివాస్‌రావు పలువురు పంచాయతీ కార్యదర్శులు, మల్టీపర్పస్ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే మందుల సామేల్

శాలిగౌరారం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శాలిగౌరారం మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా అమ లు చేస్తుందని అన్నారు. అనంతరం మండలంలోని పెర్క కొండారం గ్రామంలో జరిగిన రెవె న్యూ సదస్సులో పాల్గొని మాట్లాడుతూ భూభారతి చట్టాన్ని ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకొని భూ సమస్యలు పరిష్కరించుకోవాలి అన్నా రు. కార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరి, ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి, మార్కెట్ కమి టీ చైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సమరం రెడ్డి పాల్గొన్నారు.

● మండలంలోని పెర్క కొండారం గ్రామంలో జరిగిన భూ భారతి కార్యక్రమంలో ఎమ్మెల్యే



శాలిగౌరారంలో లబ్దిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సామేల్

పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి, నీటిపారుదల డీఈ సత్యనారాయణ, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్,మార్కెట్ వైస్ చైర్మన్ నరిగే నర్సింహ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పడాల రమేష్, గైగుళ్ల అవిలయ్య, నాయకులు బెల్లి వీరభద్రం, భూపతి అంజయ్య, వడ్లకొండ పరమేష్, వేముల గోపినాథ్, బొల్లికొండ గణేష్, పోల్దాస్ నరేష్, బండమీది రమేష్, అల్లి సైదులు, పుల్లూరి దేవేందర్, కడారి అంజయ్య, మొగుళ్ల శ్రీనివాస్, నరేష్ మహేష్, మూర్తి పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

చిట్యాలరూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చిట్యాల తహసీల్దార్ జి.కృష్ణ, నాయబ్ తహసీల్దార్ బి.విజయ అన్నారు. చిట్యాల మండలంలో రెవెన్యూ సదస్సులు మంగళవారం 6వ రోజు కొనసాగాయి. మండలంలోని సుంకెనపల్లిలో తహసీల్దార్, నేరడలో నాయబ్ తహసీల్దార్ల ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు జరిగాయి. సుంకెనపల్లిలో 53, నేరడలో 49 అర్జీలు వచ్చాయి. సదస్సులో సర్వేయర్ రజనీకాంత్, ఆర్ఐ జానీ షరీఫ్, సీనియర్ అసిస్టెంట్ శశిధర్, జూనియర్ అసిస్టెంట్‌లు, సిబ్బంది కృష్ణవేణి, దయాకర్, రమేష్, హరిప్రీత్‌రెడ్డి, విజయ్, ఫరీద్, నదీమ్, దయాకర్, రాంబాబు పాల్గొన్నారు.



నేరడలో అర్జీలు తీసుకుంటున్న నాయబ్ తహసీల్దార్ విజయ

● కేతేపల్లి : మండలంలోని చెరుకుపల్లి, ఇనుపాముల గ్రామాల్లో మంగళవారం భూభారతి-2025 చట్టం కింద అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన రైతుల నుంచి వివిధ రెవెన్యూ సంబంధిత సమస్యలపై దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. చెరుకుపల్లిలో 107, ఇనుపాములలో 135దరఖాస్తులు అందినట్లు తెలిపారు. మండల ఇన్‌ఛార్జి తహసీల్దార్ మహ్మద్ అబ్దుల్ సత్తార్ ఆయా గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులను పర్యవేక్షించారు. ఆయా సదస్సుల్లో ఎంఆర్ఐ ఎన్.వెంకన్న, ఏఆర్ఐ ఎ.రామచంద్రయ్య సీనియర్ అసిస్టెంట్ జె.అర్జున్ భగవాన్, సర్వేయర్ బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వ్యవసాయ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

శాలిగౌరారం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి ఎస్‌బీఐ అందిస్తున్న రుణాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ ఏజీఎం శ్రీకాంత్ సాహో అన్నారు. వ్యవసాయ రుణ అవగాహన వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం శాలిగౌరారం స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో లో రైతులకు వ్యవసాయ రుణాలు, యంత్రాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఏజీఎం శ్రీకాంత్ సాహో ముఖ్య అతిథిగా మాట్లాడారు. క్రాప్ లోన్స్ సంఘ బంధాలకు రుణాలే కాకుండా స్టేట్ బ్యాంక్ వారు ట్రాక్టర్లు, హార్వెస్టర్స్ డ్రోన్స్, డెయిరీ, ఫిషర్స్ యూనిట్లకు ఋణ సదుపాయం కలిపిస్తున్నామన్నారు. రైతులు ఇలాంటి యూనిట్లు పొంది ఆర్థిక స్వావలంబన సాధించాలని కోరారు. కార్యక్రమంలో సీఎం క్రెడిట్ వంశీ, బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు ఫీల్డ్ ఆఫీసర్ సుజన్, క్యాష్ ఆఫీసర్ లింగస్వామి బ్యాంక్ సిబ్బంది, వినియోగదారులు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌బీఐ ఏజీఎం శ్రీకాంత్

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలి

నార్కట్‌పల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా ప్రీ స్కూల్ పిల్లల నమోదు 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు అంగన్‌వాడీలో జరిగే ప్రీ స్కూల్ విద్యా కార్యక్రమాలు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నకిరేకల్ ప్రాజెక్టు సీడీపీవో అ స్రా అంజుమ్ మాట్లాడుతూ పిల్లలకు నాణ్యమైన భోజనంతో పాటు పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సరిత, అంజమ్మ, అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, సంధ్య తదితరులు ఉన్నారు.

● చిట్యాలరూరల్: మూడేళ్లు నిండిన చిన్నారులను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాల్లో వారి పేర్లను నమోదు చేయించాలని సీడీపీవో లావణ్యకుమారి అన్నారు. చిట్యాల మండలం వెలిమినేడు, పెద్దకాపర్తిలో మంగళవారం అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు, చిన్నారులు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎన్. సునీత, పి. రేణుక, ఎం. అండాలు, ధనలక్ష్మి, వి. సునీత, బి. నాగేంద్రమ్మ, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన



కేతేపల్లి బడిబాట ర్యాలీలో పాల్గొన్న హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, తదితరులు

కేతేపల్లి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు, తెలుగు మీడియాల్లో విద్యాబోధన సాగుతుందని ఇనుపాముల జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు ముశం వెంకటేశ్వర్లు అన్నారు. కేతేపల్లి మండలంలోని ఇనుపాముల మంగళవారం స్థానిక జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులతో కలిసి బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి, మెరుగైన విద్యాబోధన, సౌకర్యాలు కలిగిన ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత యూనిఫామ్, పుస్తకాలు, నాణ్యమైన మధ్యాహ్న భోజన వసతి ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కె.వెంకటరెడ్డి, కె.లక్ష్మీనారాయణ, జి.శ్రీనివాస్, జి.దీప్తి, సుగుణమ్మ, వై.ఎల్లయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు భరోసా వెంటనే విడుదల చేయాలి : సీపీఎం

నాంపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా నిధుల వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని సీపీఎం మండల మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి అన్నారు. మంగళవారం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరన్నర కావస్తుందని, ఇప్పటికే రెండు సీజన్లు ముగిశాయని, ఈ వానాకాలం సీజన్‌లో మూడు సీజన్లు అవుతాయని చెప్పారు. ఇప్పటివరకు రైతు భరోసా విడుదల చేయకపోవడంతో రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అధిక వడ్డీలకు డబ్బులు తెచ్చుకొని పంటలను సాగు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పెట్టుబడి కోసం అందించే రైతు భరోసాను వెంటనే అందించే విధంగా ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరారు. మూడు సీజన్‌లకు కలుపుకొని ఒకటేసారి నిధులు విడుదల చేయాలని కోరారు. అదేవిధంగా పెండింగ్ ఉన్న రైతుబంధు నిధులను వెంటనే విడుదల చేసి అందరికి రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రైతులకు కావలసిన ఎరువులు విత్తనాలు పురుగుల మందులు అందుబాటులో ఉంచాలని నకిలీ విత్తనాలను పురుగుల మందులను అరికట్టాలని కోరారు. సాగునీటి విడుదలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు వాసిపాక ముత్తిలింగం, లక్ష్మయ్య, వెంకటయ్య, ఎల్లేష్ పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

నార్కట్‌పల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధి నిర్మూ లనకు వైద్య సిబ్బందితో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీపీహెచ్‌వో రాష్ట్ర సభ్యుడు సకల రెడ్డి అన్నారు. మండలంలోని అంకెనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం బృందం సభ్యులు సందర్శించి అక్కడి సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లకు కుష్ఠ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి ఎండీజేరే వాడినచో కుష్ఠువ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని,అంగవైకల్యం రాకుండా నివారించవచ్చని తెలిపారు కార్యక్రమంలో వైద్య సిబ్బంది వెంకటేశ్వరాచారి, శ్రీనివాసరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, భగవాన్ నాయక్, అనిల్ తదితరులు ఉన్నారు.



అంకెనపల్లిలో కుష్ఠువ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది


కాంగ్రెస్ నేతకు గ్లోబల్ ఐకాన్‌విన్నర్స్ అవార్డు

కనగల్, జూన్10, (ఆంధ్రజ్యోతి) : కనగల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మండల కోఆప్షన్‌గాయకుడు ఎండీ హఫీజుద్దీన్ గ్లోబల్ ఐకాన్ విన్నర్స్ అవార్డును అందుకున్నారు. ఫ్రెండ్ షిప్ మినిస్ట్రీస్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అలైడ్ ఆర్టిస్ట్ ఆడిటోరియం హిమాయత్‌నగర్ లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాల్‌చారి అవార్డును అందజేశారు. ఈసందర్భంగా హఫీజుద్దీన్ మాట్లాడుతూ గ్లోబల్ ఐకాన్ అవార్డును అందుకోవటం సంతోషంగా ఉందన్నారు.



అవార్డును అందుకుంటున్న హఫీజుద్దీన్

ఆంధ్రజ్యోతి
***
ANDHRAJYOTHY
నల్లగొండ
5
బుధవారం 11 జూన్ 2025




చికెన్ ధరలు	
లైవ్	124
డ్రెస్	184
స్కిన్‌లెస్	210
గుడ్డుడజన్	66
ఉష్ణోగ్రత	
గరిష్ఠం	39.0
కనిష్ఠం	23.0

నత్తనడకన కేజీబీవీ నిర్మాణ పనులు

● రెండేళ్లుగా సాగుతున్న పనులు



8



రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగులకు, దూపదీప నైవేద్య అర్చకులకు వరాల జల్లు కురిపించింది. సుదీర్ఘకాలంగా సేవలు అందిస్తున్న అర్చక, ఉద్యోగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు ఏర్పాటు చేసి పలు సంక్షేమ పథకాలను అమలు చేయనుంది. గత ప్రభుత్వం ట్రస్ట్‌ను ఏర్పాటు చేసినప్పటికీ నిధులు సమకూర్చలేదు. అయితే ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రకటించింది. దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అర్చక సంక్షేమ నిధి ద్వారా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న 250మంది అర్చకులు, 500 మంది దూపదీప నైవేద్య అర్చకుల సంక్షేమ నిధితో లబ్ధి చేకూరనుంది.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

అర్చక, ఉద్యోగులకు వరాల జల్లు


- గ్రాట్యుటీ రూ.4 లక్షల నుంచి రూ.8 లక్షలకు పెంపు
- 500మంది డీడీఎన్ఎస్, 250మంది దేవాదాయ అర్చకులు,ఉద్యోగులకు ప్రయోజనం

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో సుదీర్ఘకాలంగా తమ సంక్షేమం కోసం ఎదురుచూస్తున్న అర్చక ఉద్యోగులకు ఊరట కలిగిందని చెప్పవచ్చు. అర్చకులు, ఉద్యోగులపై ఆధారపడిన ఎంతో మంది కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పథకాలు ఎంతగానో ప్రయోజనం చేకూర్చే విధంగా ఉన్నాయి.

అర్చక ఉద్యోగులు, డీడీఎన్ఎస్‌లకు ప్రయోజనం ఇలా..

ప్రభుత్వం గ్రాట్యూటీ రూ.4 లక్షల నుంచి రూ.8 లక్షలకు పెంచింది. అదేవిధంగా అర్చకులు, ఉద్యోగులకు మరణాంతరం, రిటైర్‌మెంట్ గ్రాట్యుటీ గ్రాంట్ రూపంలో 20 ఏళ్ల సేవలు అందించిన వారికి రూ.8లక్షల వరకు, 15 ఏళ్ల సేవలు అందించిన వారికి రూ.6లక్షలు, 10 ఏళ్ల సేవలు అందించిన వారికి రూ.4లక్షలు, 10 ఏళ్ల సర్వీస్ పూర్తికాక ముందే మరణిస్తే రూ.2లక్షల గ్రాట్యూటీ రూపంలో చెల్లించనున్నారు. డీడీఎన్ అర్చకులకు మరణాంతరం గ్రాంట్ రూపంలో 20 ఏళ్ల సేవలు అందించిన వారికి రూ.4లక్షలు, 15ఏళ్ల అందించిన వారికి రూ.3లక్షలు, 10 ఏళ్ల సేవలు అందించిన వారికి రూ.2లక్షలు, 10 ఏళ్ల పూర్తికాక ముందే చనిపోతే రూ.లక్ష గ్రాంట్ చెల్లించనున్నారు. మెడికల్ బోర్డు సిఫార్సు చేసిన ప్రకారంగా రూ.2లక్షల వరకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ గ్రాంట్ ఇవ్వనున్నారు. డీడీఎన్ ఉద్యోగుల పిల్లల పెళ్లికి రూ.లక్ష116లు, రెగ్యూలర్ ఉద్యోగులకు..

- మిగతా 6వ పేజీలో...



పీసీసీ కార్యవర్గంలో ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యం

- ముగ్గురికి ఉపాధ్యక్ష, నలుగురికి ప్రధాన కార్యదర్శి పదవులు
- యువనేతలకు అవకాశం
- ఎంపీ రఘువీర్‌కు పీసీసీ ఉపాధ్యక్షుడిగా ఛాన్స్
- ఆశించని పదవి ఇవ్వడంపై గుమ్ముల నారాజ్!

ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యవర్గంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా నాయకులకు ప్రాధాన్యం దక్కింది. పీసీసీ ఉపాధ్యక్ష పదవులు ముగ్గురికి, నలుగురికి ప్రధాన కార్యదర్శి పదవులు దక్కాయి. పీసీసీ ఉపాధ్యక్షులుగా నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, కొండేటి మల్లయ్య, గుమ్ముల మోహన్‌రెడ్డికి అవకాశం దక్కితే, ప్రధాన కార్యదర్శులుగా చనగాని దయాకర్‌గౌడ్, దైద రవీందర్, చకిలం రాజేశ్వర్‌రావు, వీ.రామారావుగౌడ్‌ని నియమించారు. పీసీసీ కార్యవర్గంలో ఉమ్మడి జిల్లా నుంచి ఎంపీతో పాటు, కీలక నేతలకు పదవులు దక్కడంపై కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

పీసీసీ కార్యవర్గంలో ఉమ్మడి జిల్లా నుంచి కీలకమైన నాయకులకే పీసీసీ కార్యవర్గంలో అవకాశం దక్కిందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ సాగుతోంది. జిల్లా నుంచి ప్రాతినిధ్యం దక్కిన వారిలో ముగ్గురు ఓసీ నేతలుండగా, ఇద్దరు ఎస్సీ నేతలు, ఇద్దరు బీసీ నేతలకు పదవులు వరించాయి. యువతరంతో పాటు ఆయా సందర్భాల్లో పార్టీకి పట్టుగొమ్మల్లా నిలిచిన నాయకులకు ఈ పదవులు దక్కాయనే అభిప్రాయం వెల్లడవుతోంది. రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయడంతో పాటు కేడర్‌ని బలోపేతం చేయడం ద్వారా వచ్చే ఎన్నికల నాటికి పార్టీకి సులభంగా విజయం దక్కేలా చూడాల్సిన కీలకబాధ్యతలు ఈ పీసీసీ కార్యవర్గంపై ఉందని పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఇప్పటికే పేర్కొనడం ఈ పదువులు పొందిన నేతలపై ఉన్న బాధ్యతలని తెలుపుతోంది. దక్షిణ భారతదేశంలోనే అత్యధికమెజార్టీతో గెలిచిన నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌కి పీసీసీ ఉపాధ్యక్షుడిగా అవకాశం దక్కింది. గత పీసీసీ కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన రఘువీర్, అంతకుముందు రాష్ట్ర యువజన కాంగ్రెస్‌లో జాయింట్ సెక్రటరీగా పనిచేశారు. మరో ఉపాధ్యక్షుడిగా నియమితులైన గుమ్ముల మోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి వీరవిధేయుడుగా పేరుగాంచారు. విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్ కార్యకర్తగా పనిచేస్తున్న ఆయన ఒక పర్యాయం జడ్పీటీసీ సభ్యుడిగా పనిచేయగా, ఉమ్మడి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం పనిచేశారు. నల్లగొండ పట్టణాధ్యక్షుడిగా ప్రస్తుతం కొనసాగుతున్నారు. ఉపాధ్యక్షపదవి వరించిన మరో నేత కొండేటి మల్లయ్య గత పీసీసీ కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా ఉండగా, అంతకుమునుపు ఆయన నిడమనూరు జడ్పీటీసీ సభ్యుడిగా పనిచేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నకిరేకల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే టిక్కెట్ ఆశించగా, అప్పటి సమీకరణాల్లో అవకాశం దక్కలేదు. తాజాగా ఈయనకు ఈ పదవి వరించింది.

ప్రధాన కార్యదర్శులుగా నలుగురికి ఛాన్స్

పీసీసీ తాజా కార్యవర్గంలో ఉమ్మడి జిల్లా నుంచి నలుగురు కీలకనాయకులు ప్రధాన కార్యదర్శులుగా నియమితలయ్యారు. సూర్యాపేట నియోజకవర్గం తాళ్లఖమ్మంపహాడ్‌కు చెందిన సీనియర్‌నేత చకిలం రాజేశ్వరరావుకు ఈ కమిటీలో ప్రధాన కార్యదర్శిగా అవకాశం దక్కింది. ఈయన గత కార్యవర్గంలో పీసీసీ అధికార ప్రతినిధిగా పనిచేయగా, అంతకు మునుపు ఉమ్మడి జిల్లా డీసీసీ అధికార ప్రతినిధిగా సుదీర్ఘకాలం పనిచేశారు. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌లలో పనిచేస్తూ వచ్చిన రాజేశ్వరరావు పార్టీలో తుంగతుర్తి నియోజకవర్గ కోఆర్డినేటర్‌గానూ పనిచేశారు. అదేవిదంగా పార్టీ అనుబంధ సంఘాల్లో, పార్టీ కార్యక్రమాల్లో విస్తృతస్థాయిలో పనిచేసిన అనుభవం రాజేశ్వరరావుకు ఈ పదవి దక్కడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ప్రధాన కార్యదర్శిగా మరో కీలకనేత దైద రవీందర్‌కు అవకాశం దక్కింది. సూర్యాపేట మాజీ ఎమ్మెల్యే దైద సుందరయ్య తనయుడైన దైద రవీందర్ 2016లో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం పీసీసీ కార్యదర్శిగా నియమితులైన ఆయన నకిరేకల్ ఇన్‌చార్జిగా పనిచేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నకిరేకల్ ఎమ్మెల్యే టిక్కెట్ ఆశించి, చివరివరకు పోటీపడ్డారు. ప్రస్తుతం ఈయనకు పీసీసీ ప్రధాన కార్యదర్శిగా అవకాశం ఇవ్వడం ద్వారా మరోసారి ఆయన క్రియాశీలకమయ్యేందుకు అవకాశం ఏర్పడింది. పీసీసీ ప్రధాన కార్యదర్శిగా జిల్లా నుంచి మరో బీసీ యువనేత చనగాని దయాకర్‌గౌడ్‌ని నియమించారు. నకిరేకల్ మండలం తాటికల్‌కు చెందిన ఈయన విద్యార్థి జేఏసీ నేతగా తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పనిచేసిన సమయంలో పార్టీలో చేరిన దయాకర్‌గౌడ్ పార్టీ నిరుద్యోగ జేఏసీ నాయకుడిగా, పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పలు ఆందోళనలు, ఉద్యమాల్లో క్రియాశీలకపాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో ఆయనకు తాజాగా పీసీసీ ప్రధానకార్యదర్శి పదవి దక్కింది. మరో...

- మిగతా 6వ పేజీలో...

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



బుదుమర్లపల్లి సదస్సులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

కనగల్,జూన్ 10 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ జే శ్రీనివాస్ కోరారు. మండంలోని బుదుమర్లపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన సదస్సును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. రైతుల నుంచి అందిన దరఖాస్తులను సక్రమంగా నమోదు చేయాలన్నారు. కాగా భూసమస్యల పరిష్కారం కోరుతూ 50 దరఖాస్తులను రైతులు అందజేశారని తహసీల్దార్ పద్మ తెలిపారు. అదేవిధంగా తుర్కపల్లి గ్రామంలో జరిగిన సదస్సులో 11 దరఖాస్తులు వచ్చినట్లు డీటీ పార్వతమ్మ తెలిపారు. ఆయా సదస్సుల్లో సీనియర్ అసిస్టెంట్ విఘ్నేష్‌రెడ్డి, లతీఫ్ తదితరులున్నారు.

జిల్లాలో మూడు నూతన స్వయం సహాయక సంఘాలు



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి

మిర్యాలగూడ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నూతనంగా మూడు రకాల స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖాధికారి వై.శేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక సెర్ప్ కార్యాలయంలో మండల సమాఖ్య సంఘాల ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 16-18 వయసు గల కిశోర బాలికలు, 60 ఏళ్ల పైబడిన వృద్ధ మహిళలు, దివ్యాంగులకు నూతనంగా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. మహిళా సంఘాలకు ఇచ్చిన బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు రూ.1200 కోట్లలో ఇప్పటివరకు 68శాతం రివరికీ సాధించామన్నారు. చందంపేట, నేరేడుగొమ్ము, నాంపల్లి, త్రిపురారం, పీఏపల్లి, తిరుమలగిరి(సాగర్) మండలాల్లో రికవరీ శాతం తక్కువగా ఉందన్నారు. రికవరీ కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. రుణాల్లో కనీసం 75శాతం చెల్లిస్తేనే కొత్తరుణాలు వచ్చే అవకాశం ఉందన్నారు. సంఘాలకు నూతన పాలక కమిటీలు ఏర్పాటు అవుతున్నాయని వారికి శిక్షణ ఇచ్చేందుకు నిపుణులైన టీంలను ఏర్పాటు చేశామన్నారు. గతంలో 2,91 లక్షల మంది సభ్యులుండగా ఈ ఏడాదిలో మరో 11,267 మందిని చేర్పించామన్నారు. 1,164 గ్రామ, 32 మండల సమాఖ్యలు ఉన్నాయన్నారు. ఈనెల 21న జిల్లా సమాఖ్యలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఈ ఏడాది బ్యాంకు లింకేజీ రూ. 1096 కోట్లు, స్త్రీనిధి రూ.140 కోట్లు రుణ లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటివరకు రూ.96 కోట్ల రుణాలు మంజూరు చేశామన్నారు. వనమహోత్స కార్యక్రమంలో భాగంగా ఈ వానాకాలం సీజన్‌లో 69.5 లక్షల మొక్కలు లక్ష్యంకాగా డీఆర్‌డీఏ,పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో 39.5లక్షల మొక్కలు నాటేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఉపాధిహామీ కూలీలకు గతంలో దినసరి వేతనంగా రూ.192ఉండగా, కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం రూ.276కు పెంచినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎంలు కృష్ణమూర్తి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

డ్రా లబ్ధిదారులకే డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలి

8

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

● కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలుచేస్తున్న పౌష్టికాహార పంపిణీ, పాఠశాల పూర్వ విద్య కార్యక్రమాల ద్వారా లబ్ధి పొందేందుకు 5 సంవత్సరాలలోపు పిల్లలందరినీ దగ్గరలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. ఈ నెల 10 నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్న 'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని గొల్లగూడలోని 3వ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో చిన్న పిల్లలతో నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. గర్భిణులు, బాలింతలు, ఆరు నెలల నుంచి ఐదు సంవత్సరాలలోపు ఉన్న పిల్లలను సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు.

విద్యార్థుల నమోదుపై దృష్టి కేంద్రీకరించాలి

పాఠశాల విద్యను పటిష్టపరచడంలో భాగంగా విద్యార్థుల నమోదుపై దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఉదయాదిత్య భవన్‌లో విద్యాశాఖ అధికారులతో పాటు, మండలాల ప్రత్యేక అధికారులతో విద్యాశాఖ కార్యక్రమాలపై మంగళవారం సమీక్షించారు. మధ్యలో బడి మానేసే వారి శాతాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో మండలాల ప్రత్యేక అధికారులు సైతం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ప్రతి పాఠశాల వారీగా గత సంవత్సరం విద్యార్థుల నమోదు, ఈ సంవత్సరం విద్యార్థుల నమోదుపై నివేదిక సమర్పించాలని, అలాగే ప్రతి కేజీబీవీ వారీగా విద్యార్థుల నమోదు వివరాలు ఇవ్వాలన్నారు. పాఠశాలల పునఃప్రారంభం విద్యార్థుల నమోదు, టీచర్లు, తల్లిదండ్రుల సమావేశాలు, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల యూనిఫాం, భవిత కేంద్రాల సంసిద్ధత, మధ్యలో బడి మానేసేవారు, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. భవిత కేంద్రాల్లో అన్ని సౌకర్యాలను మరోసారి పరిశీలించాలని, మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. 12న పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా 12,13వ తేదీన టీచర్లు, తల్లిదండ్రుల మెగా సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజా ప్రతినిదులను భాగస్వామ్యం చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో రెండు రోజుల పాటు పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్యను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి కలెక్టర్ నారాయణ అమిత్, డీఈవో బిక్షపతి, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడి బాట కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి

భూ భారతి నిబంధనల ప్రకారమే భూ సమస్యలు పరిష్కారం

మర్రిగూడ: రెవెన్యూ సదస్సులను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం మండలంలోని కుదాభక్షిపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో రైతులను భూ సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో గతంలో ఇచ్చిన సీలింగ్ భూములకు నూతన పాస్ పుస్తకాలు ఇవ్వాలని కోరారు. సాగుకు యోగ్యంకాని భూమి ఉంటే వాటిని రైతులే స్వచ్ఛందంగా నాలా చేసుకోవాలని, లేని పక్షంలో వారికి భారీగా ఫైన్ వేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాస్‌నాయక్, మద్ది విట్టల్ రెడ్డి, పాశం సురేందర్‌రెడ్డి, బూడిద సురేష్ పాల్గొన్నారు. మర్రిగూడ మండలకేంద్రంలోని 30 పడకల కమ్యూనిటీ హెల్త్ ఆస్పత్రిని కలెక్టర్ చేశారు.

నకిలీ పత్తి విత్తన దందా

- భారీ మొత్తంలో నకిలీ విత్తనాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తయారీ జిల్లాలో విక్రయాలు
- ధర తక్కువగా ఉండటంతో ఆకర్షితులవుతున్న రైతులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ పత్తి విత్తన ప్యాకెట్లు

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట క్రైం)

సూర్యాపేట జిల్లాలో నకిలీ పత్తి విత్తనాల దందా కొనసాగుతోంది. ప్రభుత్వం నిషేధించిన పలు రకాల పత్తి విత్తనాలను గుట్టు చప్పుడు కాకుండా గ్రామాల్లో అమ్ముతున్నారు. కొందరు ఏజెంట్లు నకిలీ విత్తనాలను అందమైన ప్యాకింగ్‌లు చేసి గ్రామాల్లో తిరుగుతూ వీటితోనే ఎక్కువ దిగుబడి వస్తుందని నమ్మించి విక్రయిస్తున్నారు. చూడటానికి బాగానే ఉండటం, తక్కువ ధర ఉండటంతో పలువురు రైతులు వీటిని కొనుగోలు చేస్తున్నారు. ఎక్కువగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల నుంచి ఈ విత్తనాలు సరఫరా అవుతున్నాయి.

- వివరాలు 6లో

నిర్వాసితులందరికీ పరిహారం, పునరావాసం

- భూనిర్వాసితులకు పరిహారం పంపిణీ చేసిన ఎమ్మెల్యే బాలునాయక్

7

శాలిగౌరారం ప్రాజెక్టు కాల్వలకు నీటి విడుదల

- పొదుపుగా వాడుకోవాలి : ఎమ్మెల్యే సామేల్

7





పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డీపీఎంవో వెంకటేశ్వరాచారి

కుష్ఠువ్యాధి నిర్మూలనకు కృషి

చిట్యాలరూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధి వచ్చిన వారికి మల్టీ డ్రగ్ థెరపీతో పూర్తిగా నిర్మూలించవచ్చని జిల్లా పారామెడికల్ అధికారి భగవాన్‌నాయక్ అన్నారు. మండలంలోని వెలిమినేడు పీహెచ్‌సీని మంగళవారం కుష్ఠువ్యాధి నిర్మూలన బృందం అధికారులు డిప్యూటీ పారామెడికల్ అధికారులు వెంకటేశ్వరచారి, శ్రీనివాస్‌రెడ్డి, అరుణ, నల్లగొండ అధికారి హనీఫ్ పరిశీలించారు. ఆసుపత్రిని, రికార్డులను, రోగుల రిపోర్టులను, ల్యాబ్‌ను, మందుల పంపిణీ, నిల్వగదిని, రోగులకు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశాకార్తలతో అధికారులు సమావేశమై కుష్ఠువ్యాధి నిర్మూలన గురించి అవగాహన కల్పించారు. కుష్ఠువ్యాధి వచ్చిన మొదట్లోనే గుర్తించి నిర్మూలనకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కుష్ఠువ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి మల్టీ డ్రగ్ థెరపి ద్వారా పూర్తిగా నిర్మూలించ వచ్చన్నారు. ఎవరికైనా కుష్ఠువ్యాధి లక్షణాలు కనిపిస్తే ఆరోగ్యపరీక్షలను చేయించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి ఉబ్బు నర్సింహ, శ్యాం, సీహెచ్‌వో శ్రీనివాసచక్రవర్తి, లక్ష్మి, వైద్య పాల్గొన్నారు.

రేపు పోచంపల్లికి గవర్నర్ రాక!

ఏర్పాట్లను పరిశీలించిన యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్

భూదాన్‌పోచంపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లిని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఈ నెల 12వ తేదీన సందర్శించనున్నట్లు తెలిసింది. మంగళవారం జిల్లా కలెక్టర్ హనుమంతరావు భూదాన్‌పోచంపల్లిలో పలువురు మగ్గం కార్మికులతో మాట్లాడారు. గవర్నర్ పర్యటనలో భాగంగా చేనేత మగ్గాల పనితీరు, కార్మికుల జీవన స్థితిగతులపై అభిప్రాయాల సేకరణ, చేనేత నైపుణ్యం, ఇక్కత్ విశిష్టత తదితర అంశాలపై కార్మికులతో మాట్లాడే ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయన వెంట చేనేత జౌళిశాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు ఇందుమతి, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మ, జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ శ్రీనివాస్‌రావు, చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అంజన్‌రెడ్డి, తహసీల్దార్ పి. శ్రీనివాస్‌రెడ్డి, నాయబ్ తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఎంఆర్ఐ వెంకటెరెడ్డి, పోచంపల్లి చేనేత టైఅండ్‌డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, అర్బన్ బ్యాంకు చైర్మన్ తడక రమేష్, చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, నాయకులు భారత భూషణ్, బిట్ల గణేష్, బొమ్మ హరిశంకర్, వేశాల మురళి తదితరులు పాల్గొన్నారు.



చేనేత మగ్గం కార్మికుడి ఇంటిని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

నేడు దేవరకొండ మునిసిపల్ కమిషనర్‌తో ఫోన్ ఇన్



దేవరకొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ మునిసిపల్ కమిషనర్ సుదర్శన్‌తో 'ఆంధ్రజ్యోతి' బుధవారం ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించనుంది. ఈ కార్యక్రమం ద్వారా పట్టణ ప్రజలు తమ సమస్యలను నేరుగా కమిషనర్‌కు చెప్పుకోవచ్చు. మునిసిపల్ పరిధిలోని ప్రజా సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాలనుకునే వారు మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు సెల్. 9618455155కు ఫోన్‌చేసి నేరుగా మాట్లాడవచ్చు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలు నేరుగా ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమార్గాన్ని కోరవచ్చు.

వీధి వ్యాపారులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

దేవరకొండ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారులు ప్రభుత్వాలు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ మునిసిపల్ కమిషనర్ సుదర్శన్ అన్నారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో మంగళవారం వీధి వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కామన్ ఇన్‌ట్రెస్టేడ్ గ్రూపు సంఘాలకు రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మునిసిపల్ అధికారులు రాజు, గణేష్, జగమంతు, శక్రునాయక్, వ్యాపారులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన పెంచుకోవాలి

మిర్యాలగూడ టౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి):నేత్రదానంపై అవగాహన పెంచుకోవాలని వాసవీక్లబ్ ఐపీసీ సభ్యుడు మిట్టపల్లి విజయభాస్కర్ కోరారు. పట్టణంలోని రెడ్డీకాలనీకి చెందిన చందూరు పూర్ణచందర్‌రావు మృతిచెందగా ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు నేత్రనిధికి అందజేశారు.కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధి సామా శ్రీనివాస్, నేత్రనిధి ప్రతినిధి ఐచ్చలకూరి రమేష్, విజయ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ఎస్. కృష్ణయ్య, ఎస్ఐ, మాడ్గులపల్లి



మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు ప్రత్యేక చర్యలు తీసు కుంటున్నట్లు మాడ్గులపల్లి ఎస్. కృష్ణయ్య తెలిపారు. ఇందుకు ప్రజలు కూడా సహకరించాలని మంగళవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

(ఆంధ్రజ్యోతి-మాడ్గులపల్లి)

ఆంధ్రజ్యోతి: మండలంలో శాంతి భద్రతలను కాపాడేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్ఐ : గ్రామాల్లో విలేజ్ పోలీస్ అధికారులను నియమించి సమ స్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఇసుక అక్రమ రవాణా కాకుండా ఏం చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్ఐ : మండలంలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే ట్రాక్టర్లపై కేసులను నమోదు చేస్తున్నాం. ప్రభుత్వం ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేయడంతో ఇసుక కావాల్సిన లబ్ధిదారులు మీసేవలో దరఖాస్తు చేసుకొని ఇసుకను పొందాలి.

ఆంధ్రజ్యోతి: యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఎలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు?

ఎస్ఐ : గ్రామాల్లో యువతను చైతన్య పరుస్తున్నాం. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారా?

ఎస్ఐ : గ్రామాల్లో రాత్రి సమయంలో దొంగతనాలు జరగకుండా ఉండేందుకు పెట్రోలింగ్ చేస్తున్నాం. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ధైర్యం కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి కార్యక్రమలు చేపడుతున్నారు?

ఎస్ఐ : ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరిం చాలి. ముఖ్యంగా తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు ద్విచక్రవాహనాలు ఇవ్వడం వల్ల ర్యాష్ డ్రైవింగ్ మూలంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తాం.

నత్తనడకన కేజీబీవీ నిర్మాణ పనులు

▸▸ భవనం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు ▸▸ త్వరగా పూర్తి చేయాలని వేడుకోలు



మాడ్గులపల్లిలో నిర్మిస్తున్న కేజీబీవీ భవనం.

(ఆంధ్రజ్యోతి-మాడ్గులపల్లి): జిల్లాల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా కొత్త మండలాలను ఏర్పాటు చేయడంతో మాడ్గులపల్లి మండలం ఏర్పాటైంది. మండలానికి కస్తూర్బా పాఠశాల నిర్మించాలని అప్పటి ప్రభుత్వం భావించింది. అందులో భాగంగా రూ.2 కోట్లతో కేజీబీవీ భవనానికి శంకుస్థాపన చేశారు. అయితే రెండేళ్లు కావొస్తున్నా మండల కేంద్రంలో మాత్రం కేజీబీవీ నిర్మాణ పనులు నత్తనడకగా సాగుతున్నాయి. మాడ్గులపల్లికి చెందిన కేజీబీవీలో మొత్తం 180 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. వేసవి సెలవులు సైతం ముగిసి విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ నిర్మాణ పనులు పూర్తి కాక పోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. కాగా ఇటీవల ప్రకటించిన పద్దో తరగతి ఫలితాల్లో మాడ్గులపల్లి కేజీబీవీ విద్యార్థిని పుట్టల ప్రసన్న 563 మార్కులు సాధించి జిల్లాలోని కేజీబీవీ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించింది. మాడ్గులపల్లి కేజీబీవీ భవనాన్ని పూర్తి చేసి మౌలిక వసతులు కల్పిస్తే విద్యార్థినులు మరిన్ని ఉత్తమ ర్యాంకులు సాధించే అవకాశం లేకపోలేదు. కాని విద్యాశాఖ ఉన్నతాధికారుల అలసత్వం మూ లంగా విద్యార్థినిలు కేజీబీవీ భవనం పూర్తికాక విద్యనభ్యసించడానికి ఇతర ప్రాంతాలకు తిరగాల్సి వస్తుండడంతో చదువుపై దృష్టి సారించలేకపోతున్నారు.

సొంత భవనం లేక ఇక్కట్లు...

మాడ్గులపల్లికి కేజీబీవీ సొంత భవనం లేకపోవడంతో విద్యార్థినులు వివిధ ప్రాంతాలకు వెళ్లి విద్యనభ్యసించాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో వేములపల్లి మండలం శెట్టిపాలెంలో నాలుగేళ్లు, తిప్పర్తి మండలం కేజీబీవీ భవనంలో ఏడాది, తిరిగి వేములపల్లి మండలంలోని మోడల్ స్కూల్‌లో నాలుగు నెలలు, ప్రస్తుతం మిర్యాలగూడ మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లో విద్యను అభ్యసిస్తున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు మండల కేంద్రంలోని కేజీబీవీ భవనం పూర్తి కాకపోవడం మూలంగా ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కేజీబీవీ నిర్మాణ పనులను వేగవంతం చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు, మండల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



మాడ్గులపల్లి కేజీబీవీ భవనాన్ని పూర్తి చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. భవనం పూర్తయితే మాకు సౌకర్యంగా ఉండేది. భవనం పూర్తి కాకపోవడంతో మిర్యాలగూడకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ అధికారులు స్పందించి ఈ విద్యా సంవత్సరంలోనే అందుబాటులోకి వచ్చే విధంగా కృషి చేయాలి.

- భిక్షం (కల్వలపాలెం, విద్యార్థిని తండ్రి)

సకాలంలో భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తాం



మండల కేంద్రంలో నిర్మాణమవుతున్న కేజీబీవీ భవన నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేసి జూలై నాటికి బిల్డింగ్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటివరకు 90 శాతం పనులు పూర్తయ్యాయి. త్వరలోనే భవనాన్ని ప్రారంభించేందుకు సన్నద్ధం చేస్తున్నాం.

- వెంకటమ్మ (ఎంఈవో, మాడ్గులపల్లి)

అసమానతలు లేని సమాజ నిర్మాణమే ధ్యేయం

కొండమల్లేపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నిర్ణయం మేరకు ఎమ్మార్పీఎస్ భవిష్యత్తు ప్రయాణం అంతా అసమానతలు లేని సమాజ నిర్మాణమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎదుళ్ల ఎల్లయ్య మాదిగ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జూలై 7న ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామ గ్రామానా అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని జెండా ఆవిష్కరణ నిర్వహించాలని అన్నారు. ఎమ్మార్పీఎస్ పోరాటంతోనే రిజర్వేషన్లు అమలువుతున్నాయరు. సమావేశంలో ఆదిరాల రమేష్‌మాదిగ, కూర సాలయ్య, గడ్డం శ్రీరాములు, అందుగుల జానయ్యమాదిగ, ఎలిమినేటి రాములు, అందుగుల శ్రీనుమాదిగ, గడ్డం గిరి, యాదయ్య వెంకటయ్య పాల్గొన్నారు.

భవిత కేంద్రం భవన మరమ్మతు పనులు పూర్తి చేయాలి



భవిత కేంద్రంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ నారాయణ

మిర్యాలగూడ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రం భవన మరమ్మతు పనులు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్, మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్ ఆదేశించారు. మంగళవారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం ఆవరణంలోని భవిత కేంద్రం భవనానికి జరుగుతున్న మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.4.30 లక్షలు నిధులు వెచ్చించి టాయిలెట్స్ గదులు, ఫ్లోరింగ్, పహరి నిర్మాణం, శిథిలావస్థకు చేరిన డోర్లు, కిటికీలను మార్చి కొత్తవి ఏర్పాటు చేయడం, విద్యుత్ మీటర్ కనెక్షన్, ఫ్యాన్లు, కలరింగ్ పనులలో సగం మాత్రమే పూర్తయ్యాయని మిగతా పను లు 15 లోగాపూర్తి చేసి సిద్ధం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలునాయక్, ఎంపీడీవో శేషగిరిశర్మ, ఏఈ జగన్ తదితరులున్నారు.

లింగమంతుల ఆలయంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి పూజలు



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్థులు.

తిరుమలగిరి(సాగర్), జూన్ 10(ఆంధ్రజ్యోతి):మండలంలోని రాజవరం గ్రామంలో యాదవుల కుల దేవత లింగమంతుల సౌడమ్మ తల్లి జాతరను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి లింగమంతుల సౌడమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామస్థులు, నిర్వాహకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ అల్లిపెద్ది రాజుయాదవ్, బీఆర్ఎస్ నాయకులు బీవీ.రమణరాజు, పోలేపల్లి సైద మ్మ, అంజనేయులు, నెమలి సునీతా కృష్ణారెడ్డి, మేకల గురవయ్య, గురులింగం, లచ్చయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారమందించాలి



దామరచర్లలోఅవగాహన కల్పిస్తున్న ఎంఈవో బాలాజీనాయక్

మిర్యాలగూడ టౌన్, దామరచర్ల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారమందించాలని మిర్యాలగూడ, దామరచర్ల మండల విద్యాధికారులు లావూరి బాలు, బాలాజీ నాయక్ అన్నారు. మిర్యాలగూడ, దామరచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం పాఠశాలల మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు, సిబ్బందికి నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రభుత్వం నిర్ధేశించిన పోషకాలతో కూడిన ఆహారాన్ని తాజాగా అందించాలన్నారు. బియ్యం, నిత్యావసర సరుకులు సురక్షిత ప్రదేశాల్లో నిల్వ చేయాలని, వంటగది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, నెత్తికి, మూతికి మాస్కులు ధరించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కరుణాకర్, మంగ్యానాయక్, ధర్మానాయక్, వేణుధర్, సిద్దిఖి తదితరులు పాల్గొన్నారు. దామరచర్లలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుడు బండ వెంకటరెడ్డి, సైదానాయక్, బాలు, డీఆర్పీ గోవర్ధన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు కోల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

చందంపేట : పాఠశాలల్లో పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వాహణ, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కాం ప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మల్లేష్‌నాయక్ అన్నారు. స్థానిక ఎంఈవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన కార్మికులు, స్కావెంజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శుచి, శుభ్రతపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సమావేశంలో పంతులాల్, లోక్యానాయక్, ఎమ్మార్సీ సిబ్బంది, పాల్గొన్నారు.

ఆంజనేయుడికి నాగవల్లీ సహస్ర నామార్చన



క్షేత్రపాలకుడికి అభిషేకం చేస్తున్న భక్తులు

నాగార్జునసాగర్,జూన్10(ఆంధ్రజ్యోతి):నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయ 51వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం క్షేత్రపాలకుడు ఆంజనేయకుడికి పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ఆంజనేయస్వామికి నాగవల్లీ సహస్ర నామార్చన నిర్వహించారు. 9 గంటలకు కొట్నాలు, వసంతోత్స వం, చక్ర స్నానం, కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం నిత్యహోమం, పూర్ణహతి, దొంగలదోపు కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు రాధయ్య, రామానుజం, వెంకటాచార్యులు, భక్తులు కిశోర్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

దరఖాస్తుల ఆహ్వానం

కొండమల్లేపల్లి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాలలో ఇంగ్లిష్ మీడియంలో తాత్కాలిక పద్ధతిలో విద్యా బోధన చేయడానికి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్పె షల్ ఆఫీసర్ కత్తుల సరళ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు-1, ఇంగ్లిష్-1, ఫిజిక్స్-1, కెమిస్ట్రీ-1, బోటనీ-1, జువాలజీ-1, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్(ఎంఎల్‌టి), సంబంధిత సబ్జెక్టులలో పీజీ, బీఈడీ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖా స్తు చేసుకోవచ్చునని, వివరాలకు సెల్. 8328121148కు సంప్రదించాలని కోరారు.

తిరుమలగిరి (సాగర్)లో..

తిరుమలగిరి(సాగర్) : మండల కేంద్రంలోని కేజీబీవీలో అతిథిగా అధ్యాపకుల పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రారంభమవుతున్న దృష్ట్యా ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కోర్సును బోధించేందుకు ఎంఎస్సీ నర్సింగ్, లేదా బీఎస్సీ నర్సింగ్‌లో పదేళ్ల టీచింగ్, లేదా ప్రాక్టికల్ ఎక్స్‌పీరియన్స్ కలిగి ఉండాలని అన్నారు. అలాగే ఇంగ్లిష్ సబ్జెక్ట్ బోధించేందుకు ఎంఏ ఇంగ్లిష్, లేదా బీఈడీ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 11 నుంచి 13వరకు మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం

● *తెలంగాణ విద్యా, వికాస వేదిక కన్వీనర్ కస్తూరి ప్రభాకర్*



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యా, వికాస వేదిక నాయకులు

మిర్యాలగూడ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని తెలంగాణ విద్యా, వికాస వేదిక కన్వీనర్ కస్తూరి ప్రభాకర్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి అధ్యాపక బృందం కొనసాగిస్తున్న కృషిని గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అధ్య యనం చేయడం, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకరావడం ద్వారా మెరుగైన విద్యను అందరికీ సమానంగా అందించడం కోసం వి ద్యా, వికాస వేదిక కృషి చేస్తుందన్నారు. ఇంటర్ విద్య విద్యార్థి జీవితానికి ఓ మలుపు అని అన్నారు. కార్పొరేట్ కళాశాల పోటీని తట్టుకుంటూ పేద విద్యార్థులకు ఉచితంగా ఇంటర్ విద్యను అందించేందుకు ప్రభు త్వ జూనియర్ కళాశాల అధ్యాపక వర్గం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఒకేషనల్ గ్రూపులుగా విద్యార్థులు ఎంపీ హెచ్‌డబ్ల్యూ, కంప్యూటర్ సైన్స్, ఎమ్మెల్టీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రేపాల శ్రీనివాస్, అధ్యాపక బృందం, విద్యా, వికాస వేదిక సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



అడవిదేవులపల్లిలో అంగన్‌వాడి బాటను నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ నాగరాణి

మిర్యాలగూడ టౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల్లోనే విద్యార్థులకు నాణ్యమైన బోధన అందుతోందని ఎంఈవో బాలు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో బడి బాట మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యతతో కూడిన విద్య, భోజనం అందిస్తామని, పుస్తకాలు, డ్రెస్సులు పంపిణీ చేస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించి ఆర్థిక ఇబ్బందులు తొలగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ధర్మానాయక్, కృష్ణకాంత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

● చింతపల్లి : మండలంలోని వేంకటేశ్వరనగర్(మాల్)లోని జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఆధ్యాపకులు పోలేపల్లిరాంనగర్, బోటిమీది తండా, మాల్, గొడకొండ్లలో మంగళవారం బడి బాట నిర్వహించారు. ర్యాలీలో ఆధ్యాప బృందం ఎండి.అన్వర్, వోలీ సుధీర్‌కుమార్, శివలీల, శ్రీవాణి, సౌజ న్య, పిచ్చయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

● అడవిదేవులపల్లి : మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం అమ్మ మాట- అంగన్‌వాడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ నాగరాణి మాట్లాడుతూ తల్లిదండ్రులు 3 నుంచి 5 సంవత్సరాలలోపు తమ పిల్లలను అంగన్‌వాడి కేంద్రంలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం ముత్యాలమ్మ, అంగన్‌వాడి టీచర్లు నారాయణమ్మ, శోభ, మణెమ్మ, రేణుక, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

● వేములపల్లి, : వ రావులపెంట గ్రామంలో అంగన్‌వాడి బడిబాట నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పరిమి రజిని అంగన్‌వాడి టీచర్లు శారదా, వెంకటరమణ, విజయమ్మ, ఆయాలు సక్కుబాయి, అనిత, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డ్రా లబ్ధిదారులకే డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలి

● ***సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన***



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న డబుల్‌బెడ్‌రూమ్ డ్రా లబ్ధిదారులు

మిర్యాలగూడ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): గతంలో డ్రా తీసిన వారికే డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని పేదవర్గాలకు చెందిన నాజర్‌అలీ మీర్జా, బురహన్ కోరారు. స్థానిక ఎన్ఎస్పీ క్యాంపు నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులతో ర్యాలీ నిర్వహించి ప్లకార్డులతో నిర సన వ్యక్తం చేశారు. అనంతరం సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్‌కు వినత్రిం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం మిర్యాలగూడ రైల్వేస్టేషన్ సమీపంలో నిర్మించిన 526 డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో 450 ఇళ్లకు డ్రా తీసి లబ్ధిదారులను ఎంపిక చేశారని అన్నారు. అయినప్పటికీ ఇంత వరకు ఇండ్లు కేటాయించలేదని అన్నారు. గతంలో ఈఆర్వోలతో విచారణ చేయించి అర్హులైన వారి పేర్లను డ్రా తీసి పారదర్శకంగా నిరుపేదలను లబ్ధిదారుల జాబితాలో చేర్చారని అన్నారు. మా పరిస్థితిని అర్థం చేసుకుని తమకు ఇళ్లు కేటాయించి న్యాయం చేయాలని సబ్‌కలెక్టర్‌కు అందజేసిన వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో వి.మనోహర్, చిలుకూరి చంద్రకళ, పశులవెంకటమ్మ, బొడ్డుపల్లి కృష్ణ, మానస, జబీనా, రాధ, మంగమ్మ, గౌస్య బేగం, రమాదేవి, అజీం బాబా, సిరాజ్, జగదీశ్వరీ, షమీన్, నాగరాజు, నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే ప్రగతి

చింతపల్లి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే దేశం అన్నీ రంగాల్లో ప్రగతి చెందుతుందని జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు తెలిపారు. మంగళవారం మండలంలోని కుర్మపల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు సముద్రాల నగేష్ ఆధ్వర్యంలో 17, 18వ బూత్ అధ్యక్షులను ఏకగ్రీవంగా నియమించారు. ఈ సందర్భంగా కుర్మపల్లికి చెందిన కట్ట నరసింహను 17వ బూత్, నాగిళ్ల వంశీని 18వ బూత్ అధ్యక్షులుగా బీ జేపీ నియమించారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించుకు కార్యకర్తలు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు శివర్ల రమేష్‌యాదవ్, కుక్కుడపు రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు ఎగిరిశెట్టి అనిత శ్రీశైలం, మాజీ ఉప సర్పంచి బోరిగం జంగయ్య, పాల్గొన్నారు.

'మైదానానికి ప్రహరీ నిర్మించాలి'

మిర్యాలగూడ టౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణంలోని ఎన్నెస్పీ క్రీడ మైదానానికి ప్రహరీ నిర్మించాలని క్రీడాకారులు కోరారు. ఈ మేరకు మంగళవారం మైదానంలో క్రీడాకారులతో కలిసి స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా క్రికెటర్ రెహమాన్ అతీఫ్, బీసీ సంఘ నాయకుడు చేగొండి మురళీయాదవ్ మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ పట్టణ పర్యటన సందర్భంగా కాన్వాయ్ ప్రవేశించేందుకు కూ ల్చిన క్రీడామైదాన ప్రహరీ నేటికి పునః నిర్మించలేదన్నారు. దీంతో క్రీడామైదానం రహదారిలా మారగా, వాహనదారులు మైదానం మధ్యనుంచి రయ్‌మంటూ వెళ్తున్నారన్నారు. గ్రౌండ్‌లో సాధన చేసే క్రీడాకారులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందన్నారు.

మైదానంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు తరబడి వాయిదా పడుతోందని, మూత్రశాలలు లేవన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వెంట నే గోడ నిర్మించాలని, క్రీడాకారుల సమస్యలు పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దాసరాజు జయరాజు, శ్రీనివాస్, ఆరీఫ్, నజీర్, సందర్‌సింగ్, సర్దార్, ఉదయ్, భగత్‌సింగ్, ఇర్ఫాన్, దుర్గాసింగ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలి

చింతపల్లి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటేశ్వరనగర్(మాల్)కు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు హైదరాబాద్‌లో ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సైనిక్ విద్యార్థుల తల్లిదండ్రులు పలువురు మాట్లాడుతూ..విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం తెలంగాణలో వెంటనే సైనిక్‌స్కూల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణారెడ్డి, సైనిక్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్షుడు సందుపట్ల రామ్‌సాగర్, ప్రధాన కార్యదర్శి చీర ఐలయ్య, కోశాధికారి స్వప్న, ఎగ్జిక్యూటివ్ సభ్యులు సందుపట్ల లక్ష్మణ్ సాగర్, గౌతమ్, లావణ్య, సుధా పాల్గొన్నారు.